అధ్యాయము 3

# క్రీస్తు సువార్త పక్షమున పౌలు యొక్క అనుభవపూర్వక మరియు లేఖనాధారిత వాదన

## (భాగము 1)

మోషే యొక్క ధర్మశాస్త్రమునకు కట్టుబడి ఉండడం కంటే క్రీస్తునందు విశ్వాసము కలిగియుండడమే మిన్నయైనది అని నిరూపించుటకు పౌలు 3 మరియు 4 అధ్యాయములలో ఏడు వాదనలను ఇచ్చాడు:

మొదటి వాదన: గలతీయలో ఉన్న క్రైస్తవులు పరిశుద్ధాత్మను యేసునందు విశ్వాసము ద్వారానే పొందుకున్నారు గాని ధర్మశాస్త్రమునకు విధేయులగుట వలన కాదు (3:1-5).

రెండవ వాదన: తన విశ్వాసము ద్వారానే అబ్రాహాము నీతిమంతుడుగా ప్రకటించబడ్డాడు గాని ధర్మశాస్త్రమును పాటించడం వలన కాదు (3:6-9).

మూడవ వాదన: యూదులు ధర్మశాస్త్రమునకు పరిపూర్ణ విధేయులు కాలేరు గనుక, అది వారిపై శాపమును తెచ్చిపెట్టింది (3:10-14, 19-22).

నాలుగవ వాదన: దేవుడు అబ్రాహాముకు ఇచ్చిన వాగ్దానము ధర్మశాస్త్రము ఇవ్వబడుటకు వందల సంవత్సరముల క్రితమే చేయబడింది (3:15-18).

అయిదవ వాదన: ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశము క్రీస్తు వద్దకు నడిపించే బాలశిక్షకుడుగా (లేదా సంరక్షకునిగా) ఉండుట, మరియు ఈ ఉద్దేశము నెరవేర్చబడినది (3:23-4:7).

ఆరవ వాదన: ధర్మశాస్త్రమునకు తిరిగి వెళ్లవద్దని పౌలు తన సహోదరులకు వ్యక్తిగత విన్నపము చేసాడు. క్రీస్తు ఆశీర్వాదములను స్వీకరించిన

తరువాత కూడా ఇలా చేయడం అంటే ఒకరి సంతోషాన్ని మరియు నిరీక్షణను వదులుకోవడమే (4:8-20).

ఏడవ వాదన: హాగరు మరియు శారా అనువారల యొక్క దృష్టాంతాన్ని పౌలు ఇచ్చాడు, వీరిరువురు రెండు నిబంధనలను సూచిస్తున్నారు. (శారాచే సూచించబడిన) క్రీస్తు నందలి స్వాతంత్ర్యము (శారా యొక్క దాసియైన హాగరుచే సూచించబడిన) ధర్మశాస్త్రమునకు బంధకము కంటే మిక్కిలి శ్రేష్టమైనది (4:21-31). క్రైస్తవులు పాతనిబంధనకు పుత్రులు కారు, కాని క్రొత్తనిబంధనకు వారసులు.

1, 2 అధ్యాయాలలో, పౌలు తన అపొస్తలత్వమును మరియు అతడు ప్రసంగించిన సువార్త పక్షమున వాదించుటకు తన వ్యక్తిగత అనుభవాన్ని నివేదించాడు. 3:1-5లో, క్రైస్తవులు కృప ద్వారా రక్షించబడ్డారు, ధర్మశాస్త్రము యొక్క క్రియల ద్వారా కాదు అని గలతీయుల యొక్క సొంత ఆత్మీయ అనుభవం నుండి వాదించాడు. "ఆ అనుభవము ధర్మశాస్త్రము యొక్క పరిధిలో లేదు కానీ విశ్వాసము యొక్క పరిధిలో ఉంది."[1] వారి ప్రస్తుత వైఖరి (యూదులచే ప్రభావితం చేయబడిన) క్రీస్తులోనికి వారి యొక్క మార్పుకు ఒక వైరుధ్యంగా ఉంది అని అపొస్తలుడు చూపించాడు. వారు సువార్తను వినినప్పుడు మరియు దానికి స్పందించిన సమయాన్ని గుర్తించుకోమని అతడు వారికి పిలుపునిచ్చాడు. గలతీయలోని సంఘములోనికి యూదులు రాకముందు క్రీస్తులో వారియొక్క నూతన జీవితాలను వారు గుర్తుచేసుకోవాలని కుడా అతడు కోరాడు.

## విశ్వాసము ద్వారా పొందుకొనిన పరిశుద్ధాత్మ (3:1-5)

**[1]ఓ అవివేకులైన గలతీయులారా, మిమ్మును ఎవడు భ్రమపెట్టెను? సిలువవేయబడినవాడైనట్టుగా యేసు క్రీస్తు మీ కన్నులయెదుట ప్రదర్శింపబడెనుగదా! [2]ఇది మాత్రమే మీవలన తెలుసుకొనగోరుచున్నాను; ధర్మశాస్త్ర సంబంధ క్రియలవలన ఆత్మను పొందితిరా లేక విశ్వాసముతో వినుటవలన పొందితిరా? [3]మీరింత అవివేకులైతిరా? మొదట ఆత్మానుసారముగా ఆరంభించి, యిప్పుడు శరీరానుసారముగా పరిపూర్ణులగుదురా? [4]వ్యర్థముగానేయిన్ని కష్టములు అనుభవించితిరా? అది నిజముగా వ్యర్థమగునా? [5]ఆత్మను మీకనుగ్రహించి, మీలో అద్భుతములు చేయించువాడు ధర్మశాస్త్రసంబంధ క్రియలవలనా లేక విశ్వాసముతో వినుటవలననా చేయించుచున్నాడు?**

**వచనము 1. ఓ అవివేకులైన గలతీయులారా** అని పౌలు సంబోధించాడు. చాలా క్రొత్తనిబంధన ఆంగ్ల అనువాదాలు "ఓ" అను పదాన్ని వదిలిపెట్టాయి, గ్రీకులో అధ్యాయము దీనితో ప్రారంభమౌతుంది. "ఓ" అనునది ఆశ్చర్యార్థకమును సూచిస్తుంది Ὦ, అది ఒమేగా, గ్రీకు అక్షరమాలలో చివరి అక్షరం. ఒక పదము వలె, గ్రీకు అక్షరం ఆంగ్లములో వలె అదే విధముగా పనిచేస్తుంది, సాధారణముగా "భావోద్వేగాన్ని వ్యక్తపరిచినప్పుడు (ఒక మాట యొక్క ప్రారంభములో . . .)" ఆశ్చర్యార్థకమును

ఉపయోగించబడుతుంది.[2] సాధారణముగా గుర్తించబడినట్లుగా, గలతీయులకు పౌలు వ్రాసిన పత్రికలు అధికమైన భావోద్వేగ స్థితిలో వ్రాయబడ్డాయి. NASB, NIV, NRSV, మరియు ఇతర అనువాదాలు చేసినట్లుగా, ఈ భావోద్వేగాముతో ఉపయోగించిన ఆశ్చర్యార్థకమును మినహాయించుటకు కారణము ఏమీ లేదు.

సాధ్యమైనంత అందంగా, మరియు తప్పు ఏమాత్రము కాకుండా ఉన్నది గుడ్ స్పీడ్ యొక్క అనువాధవము - "అవివేకులైన గలతీయులారా!" - దీనిలో మూల లేఖనాలలోని "ఓ" లేనప్పటికీ. బహుశా అతి తీవ్రమైన అనువాదము Phillips యొక్క "ఓ ప్రియమైన గలతీయలోని బుద్ధిలేనివారలారా!." ఈ పదజాలం అభినందన వలె లేకపోయినా, అది ఎడతెగని ఆందోళనను పౌలు తన ప్రియమైనవారు కానీ విశ్వాసంలో చెడుగా తప్పుదోవ పట్టిన పిల్లల కొరకు వినోదాత్మకంగా తెలియజేస్తుంది. ఇది ఇతర అనువాదముల కంటే మూల అర్థమునకు దగ్గరగా ఉంది.

"అవివేకము" అను పదము ἀνόητος (*anoētos*) అను గ్రీకు పదము నుండి వచ్చింది, దాని అర్థము "బుద్ధిహీనత."[3] గ్రీకు పదమైన νοῦς (*nous*, "బుద్ధి") అను పదము నుండి ఆవిర్భవించింది, ఇది మన పదము "noetic"కు సంబంధించినది, మరియు ఇది తెలివిని సూచిస్తుంది. *Anoētos* కూడా గ్రీకు పదమైన νοέω (*noeō*, "తలంపు")నకు సంబంధించినది, మరియు దాని అర్థము "గ్రహించు," "అర్థంచేసుకోను," లేదా "తెలుసుకొను." ἀνόητος (*anoētos*) అను పదమునకు, మొదటి అక్షరం α (*a*)ను గ్రీకు వ్యాకరణకారులు "alpha privative" అని పిలుస్తారు, మరియు ఇది "లేదు," "కాదు" లేక "లేకుండా" అను అర్థమునిచ్చు ఒక వ్యతిరేక భాగము. మరొక మాటలో చెప్పాలంటే, అది సాధారణ అర్థాన్ని కలిగి ఉన్న పదాన్ని అణచివేస్తుంది. ఈ సంధర్బములో, ఆ పదం "బుద్ధిహీనమైన," "ఊహించనిది," లేదా "అవగాహన లేకుండుట" అని అర్థం ఇస్తుంది.

వాస్తవముగా, తాను సువార్త ద్వారా జన్మనిచ్చిన సహోదరులను అవమానించడం పౌలు యొక్క ఉద్దేశము కాదు (చూడండి 1 కొరింథీ. 4:15; ఫిలేమోను 10). అతడు 4:19లో "నా పిల్లలారా, క్రీస్తు స్వరూపము మీయందేర్పడు వరకు మీ విషయమై మరలా నాకు ప్రసవవేదన కలుగుచున్నది" అని చెప్పెను. ఆ వచనములో, గ్రీకు లేఖనము అక్షరాలా "నా చిన్న పిల్లలారా" (τέκνα μου, *tekna mou*) తెలుపుతుంది, ఖచ్చితముగా "నా ప్రియ పిల్లలు"గా NIVలో అనువదించబడింది. తన భాష ఒక ప్రేమ గల తండ్రివలె, యూదులు నాయకత్వములో సువార్త యొక్క ప్రాథమిక వక్రీకరన లేదా వక్రబుద్ధి గురించి ఈ "పిల్లలు" ఎంత తక్కువగా తెలుసు అనే విషయము గురించి చింతించాడు.

పౌలు, తన పిల్లలలో కొన్ని అపారమయిన ప్రవర్తనను కనుగొన్నప్పుడు, వారు ఒక అవివేకపు ఉచ్చులో పడిపోయినట్లు వారికి ఎలా వివరించాలో అను దానిని గూర్చి మాట్లాడాడు. అతడు "నీతి ధర్మశాస్త్రమువలననైతే ఆ పక్షమందు క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనమే" (2:21) అని చెప్పెను.

పాఠకులను "అవివేకులైన గలతీయులారా" అని సంబోధించిన తరువాత, **మిమ్ము్మను ఎవడు భ్రమపెట్టెను? సిలువవేయబడినట్టుగా యేసు క్రీస్తు మీ**

**కన్నులయెదుట ప్రదర్శింపబడెను గదా!** పౌలు యేసుని సిలువవేయుట మరియు దాని భావాల యొక్క తన దృశ్యరూపక ప్రదర్శన చాలా తీవ్రమైన తప్పుగా భావించడం లేదా త్వరగా మరచిపోవుటను చూచి ఆశ్చర్యపోయాడు. అతనికి యేసుని సిలువవేయుట మరియు పునరుత్థానం క్రైస్తవ సందేశము యొక్క కేంద్రభాగముగా ఉన్నది (6:14; 1 కొరింథీ. 1:22, 23; 2:2; 15:3, 4). ఎవరైనా క్రీస్తులో విమోచన యొక్క అద్భుతమైన స్వాతంత్ర్యము గురించి తెలుసుకొని, ధర్మశాస్త్రములోని బానిసత్వం వైపుకు మళ్లుట అనునది మూర్ఖత్వమునకు పైఎత్తు.

"భ్రమపెట్టెను" (βασκαίνω, *baskainō*) అని అనువదించబడిన గ్రీకు పదము క్రొత్త నిబంధనలో ఈ ఒక్క సారి మాత్రమే ఉపయోగించబడింది. నిజానికి ఈ పదము "కంటి ద్వారా ఒక దుష్ట ప్రాభావాన్ని కలిగించుట"[4] అని అర్థము. కన్ను హృదయము యొక్క ద్వారముగా పరిగణించబడుతుంది, దీని ద్వారా ఒకని యొక్క ఆలోచనలు మరియు ఆశలు తెలియజేయగలడు.[5] పురాతన మూడనమ్మకాల ప్రకారము, "వివిధ మంత్ర తంత్రముల ద్వారా ఒక వ్యక్తిని బ్రమపెట్టు లేదా ఇంద్రజాలము చేయు వాని వైపు ఒకని దృష్టిని మళ్లించున్నట్లు ప్రలోభపరచుట ద్వారా ఆ వ్యక్తి అతని స్వభామునకు విరోధమైన క్రియలు చేస్తాడు"[6] అని Kenneth L. Boles చెప్పాడు. "ఎవరు మీ మీద దుష్కార్యము చేసారు?" అని NLT చెప్తుంది (CEV; NIRV చూడండి). అలాంటి అన్యమత మూఢనమ్మకాలను పౌలు నమ్ముతున్నాడు అని ఈ భాష అర్థము కాదు. బదులుగా, అతడు తన పాఠకులు సిగ్గుపడాల్సిందిగా రూపకంగా మాట్లాడాడు. ఈ భాష గ్రీకో-రోమన్ ప్రాంతం యొక్క వాక్చాతుర్యంలో భాగము.[7]

"బహిరంగముగా ప్రదర్శించబడుట" (προγράφω, *prographō*) అనునది క్రీస్తు యొక్క మరణము, సమాదిచేయుట మరియు పునరుత్థానమును గూర్చి గలతీయులకు మొదట ప్రకటించిన అపొస్తలుడైన పౌలు యొక్క సుస్పష్ట ప్రసంగాన్ని సూచిస్తుంది. గ్రీకు పదము ఒక సంకేతము లేదా ప్లకార్డుపై ఒక బహిరంగ ప్రకటనను సూచిస్తుంది.

**వచనము 2. ఇది మాత్రమే మీవలన తెలుసుకొనగోరుచున్నాను; ధర్మశాస్త్ర సంబంధ క్రియలవలన ఆత్మను పొందితిరా లేక విశ్వాసముతో వినుటవలన పొందితిరా?** అని పౌలు అడిగాడు. పౌలు ఈ సమయంలో బాప్తిస్మము పొందే సమయంలో ప్రతి విశ్వాసి పొందుకొనే, ఆత్మ యొక్క నివాసము యొక్క ఆరంభమును గూర్చి మాట్లాడుతున్నాడు అని మొదటిగా ఒకడు అనుకొనవచ్చు (అపొ. 2:38; రోమా. 8:15-17 చూడండి). అయితే, గలతీ. 3:2 నుండి 3:5 యొక్క సామీప్యత పౌలు ప్రాముఖ్యంగా దృశ్యమయ్యే వాటిని గూర్చి - ఆత్మ యొక్క అధ్బుతకరమైన బహుమానాలు (1 కొరింథీ. 12:4-11, 27-31) - అతడు చేస్తున్న వాదనను వాస్తవంగా నిరూపించబడ్డ ఒకదానిని గురించి మాట్లాడుతున్నట్లు సూచిస్తుంది.[8] పెంతుకొస్తు దినమందు అతనితో అపొస్తలలు ఉన్నప్పుడు దేవుడు అన్యజనులకు అద్భుత శక్తిని ఇచ్చిన వాస్తవాన్ని బట్టి అన్యజనుల మార్పునకు పేతురు మద్దతునిచ్చాడు (అపొ. 11:16, 17). అదనంగా, ఇతర భాషలలో మాట్లాడగలిగే సామర్థ్యం, ఎఫేసులో మళ్లీ బాప్తిస్మము పొందిన పన్నెండు మంది శిష్యులకు ఇవ్వబడింది, వారు దేవుని యొక్క ఆత్మను పొందుకొనిన వారిగా సాక్ష్యము

కలిగియున్నారు (అపొ. 19:1-7).

సువార్తను విని దానిని నమ్మి మరియు క్రీస్తులోనికి బాప్తిస్మము పొందుట ద్వారా విధేయత చూపినప్పుడు గలతీయ క్రైస్తవులు ఆత్మ యొక్క నివాసము అను బహుమతిని పొందుకున్నారు (3:26, 27). వారు ఆ సందేశమును విని విధేయతతో విశ్వాసంతో స్వీకరించారు (రోమా. 10:17 చూడండి). ఆ తరువాత యూదులు వచ్చి, వారిపై ధర్మశాస్త్రాన్ని రుద్దాలని ప్రయత్నించారు. అయినప్పటికీ, ధర్మశాస్త్ర క్రియల ద్వారా ఆత్మను పొందలేదు అని వారు గ్రహించాలి అని కోరుకున్నాడు.[9]

**వచనము 3.** వచనము 1లోని భావమును పునరావృతం చేస్తూ, పౌలు తన పాఠకులను **మీరింత అవివేకులైతిరా?** అని అడిగెను. నేటి ప్రజలకు అలాటి ప్రశ్న కోపము పుట్టించునట్లు ఉన్ననూ, తన పాఠకులు ఆ విషాదకరమైన విషయమును గూర్చి తెలుసుకోవాలని పౌలు కోరికగా ఉన్నది. సువార్తలో వారి తండ్రిగా, తన ఆత్మీయ బిడ్డల అవసరాల కొరకు ఆయన చూస్తున్నాడు. దీర్ఘకాల పర్యవసానాలు కలిగించు తప్పులను చేయకుండా తమ పిల్లలను తప్పించుటకు మంచి తల్లిదండ్రులు కొన్నిసార్లు బాధ కలిగించు బాషను ఉపయోగిస్తుంటారు.

**మొదట ఆత్మానుసారముగ ఆరంభించి, యిప్పుడు శరీరానుసారముగ పరిపూర్ణులగుదురా?** అని పౌలు అడిగెను. "ఆత్మానుసారముగా ఆరంభించి" అను పదసమూహము బాప్తిస్మము సమయము నుండి మొదలుపెట్టు క్రైస్తవ ప్రవర్తనను సూచిస్తుంది. దేవుని కృపవలన గలతీయులు క్రీస్తులో నూతన జీవితమును ప్రారంభించారు (రోమా. 6:4). వారు ఆత్మచేత ముద్రించబడిరి (ఎఫెసీ. 1:13) మరియు సంఘమును నిర్మించుటకు ఆత్మీయ వరములచేత నింపబడిరి. దేవుడు వారిలో మరియు వారి ద్వారా పనిచేయుచున్నాడు.

గలతీయులు ఆత్మను పొందుకున్నారు గనుక, "శరీరానుసారముగా పరిపూర్ణులగుదము" అనిన ఆలోచన వారికి అవివేకముగా ఉన్నది. పూర్తి విరుద్ధం దైవిక సంబంధమైన ("ఆత్మ") మరియు మానవ సంబంధమైన ("శరీరము") మధ్య ఉంది. "శరీరము"గా అనువదించబడిన (σάρξ, *sarx*) అను గ్రీకు పదమునకు భౌతిక శరీరమునకు సంబంధించి అనేక అర్థాలు ఉన్నాయి.[10] ఈ సందర్భంలో, NLT ఈ పదమును "మానవ ప్రయత్నము" అని అనువదిస్తుంది. ఈ పదము ధర్మశాస్త్రము పట్ల విధేయతను సూచిస్తుంది (3:5 చూడండి).

"పరిపూర్ణము" అను పదము ἐπιτελέω (*epiteleō*), అను క్రియాపదమునకు అనుగుణంగా ఉంటుంది, అనగా "పూర్తిచేయుట," లేదా "ముగింపు," లేదా "పరిపక్వత చెందుట" అని అర్థము. పరిపక్వత చెందిన క్రైస్తవులుగా మారుటకు ధర్మశాస్త్రమునకు కట్టుబడి జీవించుట చాలా అవసరం అని యూదులు చెప్తున్నారు. 3:23-29లో, ధర్మశాస్త్రము యూదులను క్రీస్తులో విశ్వాసములోనికి నడిపించినట్లుగా చూపించాడేకాని, దానికి విరోధముగా కాదు. ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయుల కొరకు ఉద్దేశించబడినది (నిర్గమ. 19:3 - యేసుక్రీస్తు వచ్చి సిలువపై ఆయన మరణం వరకు). అది యూదులకు ఇవ్వబడినది, అన్యులకు కాదు. ధర్మశాస్త్రమును అనుసరిస్తున్న అన్యులైన క్రైస్తవులు తిరోగమించుచున్నారు, పురోగమించుటలేదు.

**వచనము 4.** స్వచ్ఛమైన సువార్త నుండి వెనుదిరుగుట ద్వారా గలతీయులు ఎందుకు **వ్యర్థముగానే ఇన్ని కష్టములు అనుభవిస్తున్నారో** పౌలు అర్థం చేసుకోలేకపోయాడు (1:6-9 చూడండి). లేఖనము ఈ క్రైస్తవులు ఇప్పటివరకూ గురైన కష్టముల జాబితాను చూపుటలేదు. అయినప్పటికీ, మొదటి మిషనరీ ప్రయాణములో పౌలు, బర్నబాలు కష్టాలు పడ్డారు (అపొ. 13; 14). వారు అబద్ధ బోధకులు మరియు అవిశ్వాసుల నుండి వ్యతిరేకమైన మాటలను ఎదుర్కొన్నారు. వారు పట్టణాల నుండి బయటకు పంపబడ్డారు, మరియు పౌలు రాళ్లతో కొట్టబడ్డాడు. ఈ మిషనరీలు అలాంటి ధీక్కరణతో వ్యవహరించబడ్డారు గనుక వారు విడిచిపెట్టిన చిన్న సంఘాలు అదే విధముగా వ్యవహరించబడ్డాయని అనుకోవచ్చు (అపొ. 14:2). అవిశ్వాసులైన యూదులు క్రీస్తును విశ్వసించిన యూదులను వ్యతిరేకిస్తారు అదేవిధముగా యూదులుగా మార్పు చెందకుండా (సున్నతి చేయకుండా) దేవునివైపు తిరిగిన అన్యులను వ్యతిరేకిస్తారు.

**అది నిజముగా వ్యర్థమగునా** అనుదాని యొక్క వివరణ క్రీస్తు యొక్క నిజమైన సువార్తకు గలతీయులు తిరిగి వస్తారని పౌలు భావించాడు అని వివరిస్తుంది. వారు విశ్వాసము యొక్క నియమావళికి తిరిగి వచ్చినంతవరకు వారి కష్టములు వ్యర్థము కావలసిన పని లేదు.[11]

**వచనము 5.** 3:3 యొక్క సందేశమును పునరుద్ఘాటిస్తూ, **ఆత్మను మీకు అనుగ్రహించి, మీలో అద్భుతములు చేయించువాడు ధర్మశాస్త్రసంబంధ క్రియలవలనా లేక విశ్వాసముతో వినుటవలననా చేయించుచున్నాడు?** అని పౌలు అడిగాడు. గలతీయలోని క్రైస్తవులకు క్రీస్తులో వారి యొక్క విశ్వాసమును బట్టి దేవుడు ఆత్మను దయచేశాడు మరియు వారి ద్వారా అద్భుతములు చేస్తున్నాడు అని అతడు చెప్పుచున్నాడు.

ఇక్కడ రెండు గ్రీకు పదాలు దేవుని కార్యకలాపాలను నొక్కి చెబుతున్నాయి. మొదటిది ἐπιχορηγέω (*epichorēgeō*), "దయచేయు" లేదా "సరఫరాచేయు" అని అనువదించవచ్చు. ఈ పదమునకు సంబంధించిన పదములు క్రొత్త నిబంధనలో అనేక సార్లు కనిపిస్తాయి,[12] మరియు ఇవి చాలా సందర్భాలలో దేవుని యొక్క కనికరమును నొక్కి చెబుతున్నాయి. మూల క్రియ χορηγέω (*chorēgeō*)ను "ఒక కోరస్ ను తర్ఫీదు చేయుటకు అయ్యే వెలను చెల్లించు" ధనవంతుని వర్ణించుటకు సాంప్రదాయక గ్రీకు భాషలో ఉపయోగించబడింది.[13] ఇక్కడ ఈ పద ఉపయోగం దేవుడు తన ఆత్మను ఉచితముగా ఇచ్చే ఒక ఉదార ఉపకారిగా చిత్రీకరిస్తుంది.

రెండవ గ్రీకు పదము ἐνεργέω (*energeō*), అనగా "పని" లేదా "చురుకుగా ఉండుట" అని అర్థము. దీనికి సంబంధించిన నామవాచకం ἐνέργεια (*energeia*) "శక్తి" అను ఆంగ్ల పదము వెనుక నిలుస్తుంది. ఆదిమ క్రైస్తవులచే చేయబడిన అద్భుతములు దేవుని యొక్క బలము మరియు శక్తి ఫలితమే.

గలతీయుల యొక్క పరిపక్వతలేమి కారణముగా పౌలు అద్భుతములను (ఇవి తప్పిపోనివి) గూర్చి విజ్ఞప్తి చేసాడు. "ఆత్మ ఫలములు" వాటిలో కనిపిస్తుండగా, "శరీర కార్యములు" వాటికి విరుద్ధంగా నిలుస్తున్నాయి (5:16-26; మత్తయి 7:15-23

చూడండి), ఇక్కడ సూచించిన అద్భుతములు మరింత స్పష్టంగా ఐహిక-మనస్సుగల గలతీయులను సూచిస్తుంది.

అనేక వాక్యభాగాలు, ప్రత్యేకంగా అపొస్తలుల కార్యములలో, ఆత్మ శక్తి యొక్క బాహ్య ప్రదర్శనను నొక్కి చెప్పడం ద్వారా 3:5లో పౌలు ఉపయోగించిన భాషను ప్రతిబింబిస్తున్నాయి:

> అద్భుతకరమైన గురుతులు: యేసు చెప్పెను, "నమ్మినవారివలన ఈ సూచక క్రియలు కనబడును: నా నామమున దయ్యములను వెళ్లగొట్టుదురు; క్రొత్త[14] భాషలు మాటలాడుదురు; . . . రోగుల మీద చేతులుంచినప్పుడు వారు స్వస్థతనొందుదురు." . . . వారు బయలుదేరి వాక్యమంతట ప్రకటించిరి. ప్రభువు వారికి సహకారుడై యుండి, వెనువెంట జరుగుచువచ్చిన సూచకక్రియలవలన వాక్యమును స్థిరపరచుచుండెను (మార్కు 16:17-20).

> పరిశుద్ధాత్మలో బాప్తిస్మము: తన అపొస్తలులకు యేసు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము యొక్క వాగ్దానము చేసెను. "కొద్ది దినములలోగా మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందెదరు" (అపొ. 1:5).

> పెంతెకొస్తు దినమందు అపొస్తలుల యొక్క అనుభవము: "అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై . . . అన్యభాషలతో మాటలాడసాగిరి" (అపొ. 2:4).[15]

> పెంతెకొస్తు దినమందు యోవేలు ప్రవచనమును గూర్చి పేతురు చూపుట: "యోవేలు ప్రవక్త ద్వారా చెప్పబడిన సంగతి ఇదే: . . . మనుష్యకుమారులందరిమీద నా ఆత్మను కుమ్మరించెదను;[16] మీ కుమారులు మీ కుమార్తెలు ప్రావచించెదరు . . . పైన ఆకాశమందు మహత్కార్యములను క్రింద భూమిమీద సూచక క్రియలను . . . చేసెదను" (అపొ. 2:16-19).

> పెంతెకొస్తు దినమందు పేతురు యొక్క ప్రసంగము: "కాగా ఆయన దేవుని కుడిపార్శ్వమునకు హెచ్చింపబడి, పరిశుద్ధాత్మను గుర్చిన వాగ్దానమును తండ్రివలన పొంది, మీరు చూచుచూ వినుచునున్న దీనిని కుమ్మరించియున్నాడు" (అపొ. 2:33; ఎఫెసీ. 4:7, 8, 11-13 చూడండి).

> యెరూషలేములో అపొస్తలుల యొక్క కార్యములు: "అప్పుడు ప్రతివానికి భయము కలిగెను. మరియు అనేక మహత్కార్యములును సూచకక్రియలును అపొస్తలుల ద్వారా జరిగెను" (అపొ. 2:43).

> ఫిలిప్పు యొక్క సూచకక్రియలను సీమోను చూచుట: "అప్పుడు సీమోనుకూడ నమ్మి బాప్తిస్మము పొంది ఫిలిప్పును ఎడబాయకుండి, సూచకక్రియలును గొప్ప అద్భుతములును జరుగుట చూచి విభ్రాంతి నొందెను" (అపొ. 8:13).

> సమరయలో పేతురు మరియు యోహానుల కార్యములు: ". . . పేతురు మరియు యోహాను . . . వచ్చి వారు పరిశుద్ధాత్మను పొందవలెనని వారికొరకు ప్రార్థన చేసిరి. అంతకు ముందు వారిలో ఎవరిమీదను ఆయన దిగియుండలేదు, వారు ప్రభువైన

యేసు నామమున బాప్తిస్మము మాత్రము పొందియుండిరి. అప్పుడు పేతురును యోహానును వారి మీద చేతులుంచగా వారు పరిశుద్ధాత్మను పొందిరి. అపొస్తలులు చేతులుంచుటవలన పరిశుద్ధాత్మ అనుగ్రహించబడెనని సీమోను చూచి వారి యెదుట ద్రవ్యము పెట్టి నేనెవనిమీద చేతులుంచుదునో వాడు పరిశుద్ధాత్మను పొందునట్లు ఈ అధికారము నాకియ్యుడని అడిగెను" (అపొ. 8:14-19).

కొర్నేలి ఇంటిలో పేతురు ప్రసంగాన్ని విన్న వారికి ఆత్మ యొక్క స్వీకరణ: "పేతురు ఈ మాటలు ఇంక చెప్పుచుండగా అతని బోధ విన్నవారందరిమీదికి పరిశుద్ధాత్మ దిగెను. సున్నతి పొందినవారిలో పేతురుతోకూడ వచ్చిన విశ్వాసులందరు, పరిశుద్ధాత్మ అన్యజనులమీద సయితము కుమ్మరింపబడుట చూచి విభ్రాంతినొందిరి. ఏలయనగా వారు భాషలతో మాటలాడుచు దేవుని ఘనపరచుచుండగా వినిరి. అందుకు పేతురు మనవలె పరిశుద్ధాత్మను పొందిన వీరు బాప్తిస్మము పొందకుండా ఎవడైనను ఆటంకము చేయగలడా అని చెప్పి యేసు క్రీస్తు నామమందు వారు బాప్తిస్మము పొందవలెనని ఆజ్ఞాపించెను" (అపొ. 10:44-47).

యెరూషలేములో పేతురు యొక్క సమర్థన: "నేను మాటలాడ నారంభించినప్పుడు పరిశుద్ధాత్మ మొదట మన మీదికి దిగిన ప్రకారము వారి మీదికిని దిగెను. అప్పుడు . . . మీరు పరిశుద్ధాత్మలో బాప్తిస్మము పొందుదురు అని ప్రభువు చెప్పిన మాట నేను జ్ఞాపకము చేసుకొంటిని. కాబట్టి ప్రభువైన యేసు క్రీస్తునందు విశ్వాసముంచిన మనకు అనుగ్రహించినట్టు దేవుడు వారికి కూడ సమాన వారము అనుగ్రహించియుండగా, దెవునీ అడ్డగించుటకు నేను ఏపాటివాడనని చెప్పెను" (అపొ. 11:15-17).

ఇతర వాక్యభాగాలు యేసు యొక్క పరిచర్య మరియు ఆదిమ సంఘపు కాలము రెండింటిలో అద్భుత కార్యములను స్థిరపరిచే పాత్రను బోధిస్తాయి.[17] సూచక క్రియల యొక్క ప్రామాణిక విలువ నొక్కిచెప్పడంలో, సంఘ అభివృద్ధి కొరకు వాటి యొక్క ఆచరణాత్మక, ప్రయోజనకరమైన విలువలను మనం నొక్కి చెప్పాలి (1 కొరింథీ. 12:7; 14:12, 18, 19, 26). ఒకానొక సమయంలో వ్రాయబడిన క్రొత్తనిబంధన లేనప్పుడు, దేవుని వాక్యము ప్రవచనము ద్వారా సంఘమునకు వెల్లడిచేయబడేది - అది, దేవుడు తన చిత్తాన్ని ప్రత్యక్ష ప్రేరణ ద్వారా వెల్లడించేవాడు. అదనముగా, బోధకులు సందేశము యొక్క అర్థాన్ని "జ్ఞాన వాక్యమును [లేదా ప్రకటన] వివరించేవారు" (1 కొరింథీ. 12:8) అందువలన సభ్యులు సందేశము యొక్క ఆచరణాత్మక అన్వయాన్ని నేర్చుకొనేవారు. ఇటువంటి అద్భుతమైన దృగ్విషయం ఉత్సాహము కలిగించుటకు కాదు; ప్రేమలో క్రీస్తు శరీరము యొక్క నిర్మాణాన్ని మరియు పరిపక్వతకు అవి అన్నియు ప్రయోజనకరము మరియు ఉద్దేశము కలిగియున్నాయి (ఎఫేసీ. 4:7-16).

## విశ్వాసము ద్వారా సంపాదించుకొనిన అబ్రాహాము యొక్క నీతి (3:6-9)

**[6]అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా యెంచబడెను. [7]కాబట్టి విశ్వాస సంబంధులే అబ్రాహాము కుమారులని మీరు తెలుసుకొనుడి. [8]దేవుడు విశ్వాస**

**మూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగాచూచి - నీయందు అన్యజనులందరూ ఆశీర్వదించబడుదురు అని అబ్రాహాముకు సువార్త ముందుగా ప్రకటించెను. 9కాబట్టి విశ్వాససంబంధులే విశ్వాసము గల అబ్రాహాముతో కూడా ఆశీర్వదింపబడుదురు.**

**వచనము 6.** ఆత్మ పొందినది క్రీస్తులో విశ్వాసము ద్వారా మాత్రమే ధర్మశాస్త్ర సంబంధ క్రియల ద్వారా కాదు అని స్థాపిస్తున్నాడు. అతడు LXX నుండి ఆదికాండము 15:6ను ఉదహరించడం ద్వారా విశ్వాస సూత్రాన్ని వివరించుట కొనసాగించాడు: **అబ్రాహాము దేవుని నమ్మెను అది అతనికి నీతిగా యెంచబడెను** (రోమా. 4:3 చూడండి). దాని అసలు సందర్భంలో, ఈ ప్రకటన పిల్లలు లేని అబ్రాహామునకు దేవుని యొక్క వాగ్దానమును అనుసరిస్తూ తన సంతానము ఆకాశాములోని అనేకమైన నక్షత్రములవలె అగును అని తెలుపుతుంది (ఆది. 15:4, 5). ఈ ప్రకటన దేవుడు సున్నతి గూర్చిన ఒడంబడికకు రెండు అధ్యాయముల ముందు కనిపిస్తుంది.

మూడు కారణాల మూలంగా అబ్రాహాము ఇక్కడ ఉపయోగించబడెను: (1) అతడు యూదుల యొక్క తండ్రి గనుక, (2) అతడు విశ్వాసమునకు మాదిరి,[18] మరియు అతడు ధర్మశాస్త్రము ఇవ్వడానికి కొన్ని వందల సంవత్సరాల ముందు జీవించాడు (3:17). మరొక కారణం, అబ్రాహాము యొక్క ఉపమానాన్ని ఉపయోగించి యూదులు గలతీయుల మీద సున్నతిని తిసుకురావాలనుకొనుట, కాబట్టి పౌలు వారికి వ్యతిరేకముగా వారి వాదనను తిరస్కరించాడు. గలతీ క్రైస్తవులకు "అబ్రాహాము యొక్క నిజమైన కుమారులుగా మారుత ఎంత అవసరమో అందుకు సున్నతి పొందాలి అని ఆందోళనకారులచే చెప్పబడి ఉండవచ్చు"[19] అని F. F. Bruce అనుకున్నాడు.

"అది అతనికి నీతిగా ఎంచబడినది," అని 6వ వచనం చెప్తుంది. "ఎంచబడుట" అను ఆలోచన ఒక న్యాయపరమైన భావన; నీతిమంతుడైన, న్యాయమైన న్యాయాధిపతి, దేవుని యొక్క ప్రకటన. *అబ్రాహాము తన సొంత యోగ్యత వలన నీతిమంతుడు కాదు, కానీ అతని విశ్వాసము (నమ్మకము) వలన దేవుడతనిని నీతిమంతునిగా ఎంచెను.* యూదుల తండ్రియైన, అబ్రాహాము వలె, అన్య క్రైస్తవులు మోషే ధర్మశాస్త్రము మరియు సున్నతిని పాటించకుండానే, వారి యొక్క విశ్వాసము ద్వారా నీతిమంతులుగా ఎంచబడతారు. నీతి దేవుడు ఇచ్చే బహుమతి,[20] ఏదో ధర్మశాస్త్రాన్ని సంపూర్ణంగా పాటించడం ద్వారా సంపాదించగలిగేది కాదు.

**వచనము 7.** అబ్రాహాము భౌతికముగా మరియు ఆత్మీయపరంగా యూదులకు తండ్రి. నూతన నిబంధనలో, **విశ్వాస సంబంధులు** (οἱ ἐκ πίστεως, *hoi ek pisteōs*) యేసు క్రీస్తును విశ్వసించినవారు - యూదులైనా లేదా అన్యులైనా, సున్నతిచేయబడినవారైనా లేదా సున్నతి చేయబడనివారైనా (రోమా. 4:11, 12). 2:11, 12లో పేతురు భయపడినట్లు ఆ గ్రీకు పదమును "సున్నతి సమూహాము"గా (τοὺς ἐκ περιτομῆς, *tous ek peritomēs*) కాక "విశ్వాస సమూహాము" అని అనువదించాలని R. Alan Cole సూచించాడు.[21] "విశ్వాససంబంధులే" **అబ్రాహాము యొక్క** నిజమైన ఆత్మీయ **కుమారులు.** నిజానికి, "క్రీస్తు సంబంధులైతే . . . అబ్రాహాము యొక్క

సంతానమైయుండి వాగ్దాన ప్రాకారము వారసులైయున్నారు" (3:29).

అబ్రాహాము వరస నుండి అతని వారాసులైతే నీతిమంతులైనట్లే అని యూదులు తరచూ ఒక తప్పుడు నమ్మకాన్ని కలిగి యున్నారు (యోహాను 8:33, 39, 53). బాప్తిస్మమిచ్చు యోహాను ఈ తప్పుడు నమ్మకం కలిగిన సద్దూకయ్యులు మరియు పరిసయ్యులకు భంగం కలిగించాడు. ఆయన రాళ్లవలన అబ్రాహాముకు పిల్లలను పుట్టింపగలడని అతడు వారితో చెప్పాడు (మత్తయి 3:9). అంతేగాక, భౌతికమైన సున్నతి ఒక వ్యక్తిని యుడునిగా చేయలేదని, బదులుగా, అది హృదయ లోపలి సున్నతి ద్వారా ప్రభావితమౌతుంది అని పౌలు వాదించాడు.[22] *"శరీరసంబంధులైన పిల్లలకు," బదులుగా "వాగ్దాన సంబంధులైన పిల్లలు" అబ్రాహాము "వారసులు"గా ఎంచబడుదురు (రోమా. 9:8).* అంతేకాక, "విశ్వసించు ప్రతివానికి నీతి కలుగుటకై క్రీస్తు ధర్మశాస్త్రమునకు సమాప్తియై యున్నాడు" (రోమా. 10:4; కొలస్సీ. 2:14 చూడండి). పౌలు అవిస్వాసులైన యూదులు ఏదో ఒక రోజు వారు క్రీస్తును విశ్వసిస్తే దేవుడు వారిని అంగీకరిస్తాడు అను ఒక నిరీక్షణను బయలుపరుస్తున్నాడు (రోమా. 11). క్రొత్త నిబంధన ప్రకారము, క్రీస్తులో "నూతన సృష్టి"కి సంబంధించిన వారు మాత్రమే నిజమైన "దేవుని యొక్క ఇశ్రాయేలు" (గలతీ. 6:15, 16; NIV).

**వచనము 8.** పాతనిబంధనను ఉదాహరించుట ద్వారా యూదులకు మరియు అన్యులకు ఒకేవిధముగా తన రక్షణ సువార్తను పౌలు తెలియజేశాడు. **దేవుడు విశ్వాస మూలముగా అన్యజనులను నీతిమంతులుగా తీర్చునని లేఖనము ముందుగా చూచి** నీయందు అన్యజనులందరును ఆశీర్వదింపబడుదురు అని **అబ్రాహామునకు సువార్తను ముందుగా ప్రకటించెను**. ఆదికాండము 12:3 నుండి పౌలు ఉదహరించిన వాగ్దానము **భూమి యొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదించబడును**, అనునది అబ్రాహాముకు ఇవ్వబడిన వాగ్దానము (ఆది. 18:17, 18 చూడండి). అబ్రాహాము యొక్క వంశము ద్వారా క్రీస్తు వచ్చి, ఆయన మానవుల యొక్క పాపముల నిమిత్తం మరణించి మరియు ప్రపంచమంతటికి రక్షణ దయచేయును.

ఆదికాండము 3:15లోని "అది నీ తల మీద కొట్టును; నీవు దానిని మడిమె కొట్టుదువు" అను ప్రకటన Protoevangeliumగా - అనగా, బైబిల్లోని క్రీస్తు సువార్త యొక్క మొదటి ప్రకటన-వ్యాఖ్యానించబడుతుంది. సిలువలో యేసు సాతానుని ఓడించుటకు ఈ భాష సంబంధము కలిగి ఉంది. అది సరియైనదే అయతే ఆదికాండము 12:3 సువార్త యొక్క రెండవ ప్రకటన. ఒకవేళ కాకపోతే, ఆదికాండము 12:3 మొదటిది.

ఒకే శరీరములో అన్యులను మరియు యూదులను రక్షించుట అనునది దేవుని యొక్క "నిత్యమైన ఉద్దేశము" (ఎఫెసీ. 3:1-11). ఎల్లప్పుడూ తన నూతన నిబంధన ప్రజలలో అన్యులను చేర్చుట అనునది దేవుని యొక్క ప్రణాళిక. ఈ ప్రణాళిక తరువాత ఆలోచన కాదు లేదా ఆదాము, నోవహు, అబ్రాహాము, మరియు మోషేలతో దేవుని వ్యవహారాల తరువాత నిరాశతో తీసుకొన్న నిర్ణయం కాదు"[23] అని Boles వ్రాసాడు. సమస్త వంశములు అను దేవుని యొక్క ఏర్పాటు ఆదికాండము 12:3 కన్నా ముందుగానే ప్రారంభమైంది.

**వచనము 9. విశ్వాస సంబంధులు,** 3:7 నుండి పునరావృతమయ్యే ఒక పదము,

యేసుక్రీస్తు నందు విశ్వాసముంచిన క్రైస్తవులను సూచిస్తుంది. క్రైస్తవులు **అబ్రాహాముతో కూడా ఆశీర్వదించబడినవారు** ఎందుకంటే వారు ఒకే విధమైన విశ్వాసమును పంచుకుంటున్నారు. యేసు తన సంఘ స్థాపనకు ముందు లాజరు కథ చెప్పినప్పటికీ, ఈ సందర్భములో ఆ పేదవాని యొక్క విధిని ప్రస్తావించడం అవసరం: విశ్వాసముతో జీవితాన్ని గడిపిన తరువాత, తన ఆత్మ "దేవదూతల చేత అబ్రాహాము రొమ్మున (ఆనుకోనుటకు) కొనిపోబడెను" (లూకా 16:22).

ఈ వచనములో, అబ్రాహాము **విశ్వాసి** అని పిలువబడ్డాడు. అబ్రాహాము దేవుని వాక్యమును ఉన్నది ఉన్నట్టుగా అనుసరించు వానిగా Robert L. Johnson చిత్రీకరించాడు. "అతడు విశ్వాస-సంబంధమునాకు నిజమైన మార్గదర్శకుడు మరియు మాదిరిగా ఉన్నాడు. మరియు విశ్వసించిన మనుష్యులందరూ వారి యొక్క ఆత్మీయ తండ్రి ఆబ్రాహాము యొక్క ప్రత్యక్ష వంశ వరుసలో నిలబడతారు."[24]

## యూదుల మీద ఉన్న ధర్మశాస్త్ర సంబంధ శాపము (3:10-14)

**[10]ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు. ఎందుకనగా - ధర్మశాస్త్రగ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది. [11]ధర్మశాస్త్రముచేత ఎవడును దేవునియెదుట నీతిమంతుడని తీర్చబడడను సంగతి స్పష్టమే. ఏలయనగా - నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును. [12]ధర్మశాస్త్రము విశ్వాససంబంధమైనది కాదు గాని దాని విధులను ఆచరించువాడు వాటివలననే జీవించును. [13-14]ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసము వలన మనకు లభించునట్లు అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తుయేసుద్వారా అన్యజనులకు కలుగుటకై, క్రీస్తు మనకోసము శాపమై మనలను ధర్మశాస్త్రముయొక్క శాపమునుండి విమోచించెను; ఇందునుగూర్చి - మ్రానుమీద వ్రేలాడిన ప్రతివాడును శాపగ్రస్తుడని వ్రాయబడియున్నది.**

**వచనము 10.** 3:6-9లో అబ్రాహాము విశ్వాస సూత్రం యొక్క నమూనాకు మద్దతు పలికిన తరువాత, పౌలు **ధర్మశాస్త్రము విధించిన క్రియలకు సంబంధులందరు శాపమునకు లోనైయున్నారు** అని చెప్పెను. "ధర్మశాస్త్ర సంబంధ క్రియలు" మోషే యొక్క ధర్మశాస్త్రమును సూచిస్తుంది (2:15, 16 చూడండి). క్రీస్తును మినహాయించి,[25] ఎవ్వరూ ధర్మశాస్త్రానికి సంపూర్ణంగా లోబడలేరు. కాబట్టి, యూదులు గలతీయులను ఒప్పిస్తున్నట్లు, ధర్మశాస్త్రం ద్వారా ఒక వ్యక్తి యొక్క నీతిని స్థాపించుటకు ప్రయత్నించుట అనునది స్వీయ-ఖండన, ఒకనిని శాపము క్రిందకు తీసుకురావడం.

పౌలు ద్వితీయోపదేశకాండము 27:26 నుండి ఉల్లేఖించాడు: **ఈ విధికి సంబంధించిన వాక్యములను గైకొనకపోవుటవలన వాటిని స్థిరపరచువాడు శాపగ్రస్తుడు.** ఈ ప్రకటన దేవుని ప్రజలు వాగ్దాన దేశములో ప్రవేశించకముందు కనానులో గెరిజీము పర్వతము దగ్గర ఏబాలు కొండ వద్ద మాట్లాడే దీవెనలు మరియు శాపముల సందర్భం నుండి తీసుకోబడింది. ద్వితీయోపదేశకాండము 27లో ఉదాహరించబడిన చివరి శాపం

ఇది. LXX లో కనిపించే గ్రీకు పఠనానికి పౌలు యొక్క అనుకరణ పోలి ఉంది. రెండు లేఖనాలు "అన్ని" అను పదము కలిగి ఉన్నాయి (ఆ పదములో "ధర్మశాస్త్రములో వ్రాయబడిన అన్ని విషయాలు"), హెబ్రీ లేఖనములో భావించినదే స్పష్టంచేయడం జరుగుతుంది. యాకోబు తన లేఖలో ఇదే ప్రకటన చేసాడు: "ఎవడైనను ధర్మశాస్త్రమంతయు గైకొనియు, ఒక ఆజ్ఞ విషయములో తప్పినయెడల, ఆజ్ఞలన్నిటి విషయములో అపరాధియగును" (యాకోబు 2:10). ప్రజలందరు పాపము చేసి, దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" అని పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో నొక్కి చెప్పాడు (రోమా. 3:10, 23). ఎవరూ పరిపూర్ణ విధేయతతో తనను తాను సమర్థించలేరు! అందరూ రక్షకుని నమ్మాలి.

**వచనము 11.** తరువాత, **ధర్మశాస్త్రము చేత ఎవడును దేవుని యెదుట నీతిమంతుడని తీర్చబడడు** అని పౌలు వ్రాసెను. ఎవరూ దేవుని అనుగ్రహాన్ని సంపాదించలేరు లేదా దేవుడు ఋణపడి ఉన్నాడని చెప్పలేరు. అపొస్తలుడు రోమా. 3:20లో అదే వాస్తవాన్ని పేర్కొన్నాడు: "ఏలయనగా ధర్మశాస్త్ర సంబంధమైన క్రియలమూలముగా ఏ మనుష్యుడును ఆయన దృష్టికి నీతిమంతుడని తీర్చబడడు; ధర్మశాస్త్రము వలన పాపమనగా ఎట్టిదో తెలియబడుచున్నది."

ధర్మశాస్త్రము ఆచరించుట ద్వారా సమర్థించుకొనుటకు బదులుగా, పౌలు "స్పష్టమైన" విశ్వాస సూత్రమును పేర్కొన్నాడు: **నీతిమంతుడు విశ్వాసమూలముగా జీవించును.** ఈ ప్రకటన హబక్కూకు 2:4 మీద ఆధారపడి ఉంది, ఇది రోమా. 1:17 మరియు హెబ్రీ. 10:38లలో వివరించడము జరిగింది. అసలైన సంధర్భంలో, క్రీ.శ. 605, 598 మధ్య కాలంలో యూదా జనాంగము దుష్ట బాబులోనీయుల చేతిలో దేవుని తీర్పును ఎదుర్కొంటున్నారు, ఆయన తన ప్రజలను శిక్షించినప్పటికి, ఆయన ఒక శేషమును కాపాడతానని మరియు వాగ్దాన దేశములో వారిని పునఃస్థాపిస్తాడు అని వారు తెలుసుకోవాలని దేవుడు కోరుకున్నాడు. ఆయన తన ప్రజలు, హబక్కూకు ప్రవక్తతో సహా, ఆయనను నమ్ముకోవాలని కోరుకున్నాడు. అదే విధముగా, పౌలు గలతీయులు క్రీస్తును నమ్ముకోవాలని కోరుకున్నాడు, ధర్మశాస్త్రాన్ని అనూసరిన్చె సామర్థ్యమును కాదు.

**వచనము 12. ధర్మశాస్త్రాన్ని** అనుసరించడం ద్వారా ఒక వ్యక్తి తన నీతిని స్థాపించాలనుకొనుట **విశ్వాస** సూత్రానికి విరుద్ధంగా నిలుస్తుంది (3:12), **విరుద్ధంగా** పదబంధం ద్వారా సూచించినట్లు. ఇక్కడ ధర్మశాస్త్ర సూత్రం, **దాని విధులను అనుసరించువాడు వాటివలననే జీవించును,** లేవీయకాండము 18:5 ఆధారముగా. ఈ ఉల్లేఖనము లూకా 10:28లో ఉంది, ధర్మశాస్త్రము యొక్క డిమాండ్లను నెరవేర్చగలనని ధర్మశాస్త్రోపదేశకుడొకడు చెప్పిన సందర్భంలోనిది. ఇది రోమా. 10:5, 6లో కూడ కనబడుతుంది, పౌలు మళ్ళీ అక్కడ ధర్మశాస్త్ర సూత్రాన్ని విశ్వాస సిద్ధాంతానికి విరుద్ధంగా వివరించాడు.

**వచనములు 13, 14. క్రీస్తు మనలను ధర్మశాస్త్రము యొక్క శాపము నుండి విమోచించెను.** దేవుని యొక్క ధర్మశాస్త్రమునకు అవిధేయత చూపుట ద్వారా నిందించబడిన వారిని ఆయన "విమోచించెను." "విమోచన" అను మాటకు గ్రీకు పదము

ἐξαγοράζω (*exagorazō*), అది ఒక "వ్యాపార ప్రదేశమును" (ἀγορά, *agora*) సూచించే ఒక వాణిజ్య పదము. దాని సాధారణమైన రూపము ἀγοράζω (*agorazō*) కొన్నిసార్లు బానిసల విమోచనను సూచిస్తుంది.[26] *Exagorazō* మరియు *agorazō* అను క్రియలను కూడా "కొనుగోలు" లేదా "విమోచన" అని అనువదించవచ్చు. "మనలను" అను సర్వనామాన్ని ఉపయోగించి, పౌలు బహుశా ధర్మాసాస్త్రము యొక్క బానిసత్వం క్రింద ఉన్న తనను మరియు తన తోటి యూదా క్రైస్తవులను సూచిస్తున్నాడు. విమోచన యొక్క భాషను గురించి, Leon Morris వ్యాఖ్యానిస్తూ, "పాపులు తమ పాపము నుండి విమోచన పొందలేరు అను వాస్తవాన్ని అది తెలుపుతుంది; వారి బానిసలు. ఇది వారి స్వేచ్ఛ కొరకు గొప్ప ధర చెల్లించబడింది అని కూడా నొక్కిచెబుతుంది.[27]

**మనకోసము శాపమై** యేసు మన యొక్క విమోచనను పూర్తిచేసాడు - అనగా, సిలువపై తన ప్రత్యామ్నాయ త్యాగము ద్వారా. 2 కొరింథీ 5:21లో పౌలు ఈ మార్పిడిని గూర్చి వ్రాసాడు: "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగా చేసెను." యేసు "తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను" అని పేతురు చెప్పెను (1 పేతురు 2:24). ఆ వాక్యభాగాములో, "సిలువకు" బదులుగా, ESV "మ్రాను" అను మరింత అచ్చమైన అనువాదము కలిగి ఉంది.

**మ్రానుమీద వ్రేలాడిన ప్రతివాడు శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది** గనుక ధర్మశాస్త్రము యొక్క శాపాన్ని క్రీస్తు తీసుకున్నాడు. ξύλον (*xulon*) అను గ్రీకు పదము మ్రాను, ఒక స్తంభము, కలప లేదా చెక్కతో తయారు చేసిన వస్తువును సూచిస్తుంది (ఒక సిలువ లేదా నిలువు కమ్మి వంటిది).[28] "మ్రాను" యొక్క హెబ్రీ పదము (עֵץ, *'ets*) అదే పద్ధతిలో ఉపయోగించబడింది.[29] ద్వితీయోపదేశకాండము 21:23 యొక్క అసలు సందర్భములో, ఒక చెట్టు మీద వ్రేలాడుట అనునది ఒక కొయ్యకు కట్టివేయుట సూచిస్తుంది. వ్యక్తులను సిగ్గుపరచుటకు మృతదేహాలను చంపిన తరువాత తరచుగా కొయ్యకు కట్టబడేవి లేదా వ్రేలాడదీయబడేవి (యెహో. 8:29; 10:26, 27; 2 సమూ. 21:6, 9). ఈ విదముగా కట్టుట అనునది హింస మరియు మరణదండన యొక్క పద్ధతిగా ఉపయోగించబడేది (ఎజ్రా 6:11). కాల క్రమేనా, కొయ్యకు కట్టుట అనునది సిలువవేయుటగా మారింది - ఈ ఆచరణ రోమన్ల యొద్ద స్థిరపరచబడింది. ఇది సాధారణముగా బానిసలు మరియు నేరస్తులను చంపుటకు ఉపయోగించబడేది. కొయ్యలను గూర్చి ముందు చెప్పబడిన వాక్యమును పౌలు క్రీస్తు యొక్క సిలువ మరణముకు అన్వయిస్తున్నాడు.[30]

**వచనము 14. ఆత్మను గూర్చిన వాగ్దానము విశ్వాసమువలన మనకు లభించునట్లు, అబ్రాహాము పొందిన ఆశీర్వచనము క్రీస్తుయేసుద్వారా అన్యజనులకు కలుగుటకై** ఈ బలి సిలువపై చేయబడింది. తన సంతానము మూలముగా సమస్త వంశములు అశీర్వదించబడును అను ఆదికాండము 12:3లో అబ్రాహామునకు చేసిన వాగ్దానమును యేసు నెరవేర్చాడు (గలతీ. 3:8 యొక్క వివరణను చూడండి). ఆయన యొక్క మానవ పూర్వీకుల ప్రకారము, యేసు అబ్రాహాము యొక్క వంశస్థుడు (మత్తయి 1:1, 2; లూకా 3:34), మరియు ఆయన ద్వారా ప్రజలందరూ

అశీర్వదించబడతారు. సువార్త సమస్త దేశములకు చెందినది (మత్తయి 28:18-20; మార్కు 16:15, 16; లూకా 24:47). అయినప్పటికీ, క్రీస్తులో మరియు ఆయన సంఘములో ఉన్న అన్యులు మాత్రమే ఆశీర్వదించబడినవారు. నేటి యూదులకు కుడా ఇదే వాస్తవమై యున్నది. సువార్తకు విధేయత చూపిన వారు “విశ్వాసము ద్వారా పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు” (అపొ. 2:38, 39; ఎఫెసీ. 1:13, 14).

## ధర్మశాస్త్రమునకు ముందే అబ్రాహామునకు చేయబడిన వాగ్దానము (3:15-18)

**[15]సహోదరులారా, మనుష్యరీతిగా మాటలాడుచున్నాను; మనుష్యుడు చేసిన ఒడంబడికయైనను స్థిరపడిన తరువాత ఎవడును దానిని కొట్టివేయడు, దానితో మరేమియు కలపడు. [16]అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు - సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే - నీ సంతానమునకు అనెను; ఆ సంతానము క్రీస్తు. [17]నేను చెప్పునదేమనగా - నాలుగువందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానము నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు. [18]ఆ స్వాస్థ్యము ధర్మశాస్త్ర మూలముగా కలిగినయెడల ఇక వాగ్దాన మూలముగా కలిగినది కాదు. అయితే దేవుడు అబ్రాహామునకు వాగ్దానము వలననే దానిని అనుగ్రహించెను.**

“దేవుడు అబ్రాహాముతో చేసిన మునుపటి వాగ్దానము కంటే ముందే మోషే ధర్మశాస్త్రము లేదా?” అని గలతీ పాఠకులు అడుగుతారని పౌలు ఆశించాడు. “అయితే [దేవుడు] ధర్మశాస్త్రమును ఎందుకు ఇచ్చాడు?” (3:19) - అనగా “ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశము ఏమిటి?” అని కూడా వారు అడుగవచ్చు. మోషే ధర్మశాస్త్రము ఇవ్వబడక మునుపే చాలా కాలం క్రితం దేవుడు అబ్రాహాముతో వాగ్దానము చేసెనని అపొస్తలుడు సమాధానం ఇచ్చాడు. ధర్మశాస్త్రముచే దేవుని వాగ్దానము మార్పుచేయబడదు లేదా రద్దుచేయబడదు అని ఆయన నమ్మకం.

**వచనము 15.** 3:1లో చూస్తే పౌలు “అవివేకులైన గలతీయులారా” అని తన పాఠకులను సంబోధించాడు, ఇక్కడ మాత్రం **సహోదరులారా** అను సానుకూల పదమును ఉపయోగిస్తున్నాడు. తన పాఠకులు పత్రికకు అనుకూలంగా స్పందించి సత్యసువార్త వైపు మరలుతారని నిరీక్షణ కలిగియున్నాడు అపొస్తలుడు. “సహోదరులు” అను పదము పత్రికలోని నూతన భాగములను (ఉపభాగములను) సూచిస్తుంది (1:11; 3:15; 4:12, 31; 5:11, 13; 6:1, 18).

ముగింపుకు చేరుకొనుటకు పౌలు గలతీయుల యొక్క ఆత్మీయ అనుభవమును (3:1-5) అదే విధముగా పాత నిబంధన లేఖనములను ఉపయోగించెను (3:6-14). ఈ సమయంలో, ఆయన **మనుష్యరీతిగా మాటలాడుట** మొదలుపెట్టెను; అనగా ఆయన

మానవ సంబంధముల నియమాలను వర్తింపచేసెను (రోమా. 7:1-3; ఎఫెసీ. 5:22-33 చూడండి). ఇది, NIVలో మరియు NLTలో ఉన్నట్లుగా, "అనుదిన జీవితములో నుండి ఉదాహరణ." అపొస్తలుడు చెప్పాడు, **మనుష్యుడు చేసిన ఒడంబడికయైనను స్థిరపడిన తరువాత ఎవడును దాని కొట్టివేయడు, దానితో మరేమియు కలుపడు.** మనుష్యులలో, ఒక ఒడంబడిక స్థిరపడినప్పుడు లేదా ప్రకటించినప్పుడు, అది నెరవేరువరకు మారదు. ఈ సత్యము దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానమునకు వర్తిస్తుంది. పౌలు పోల్చడం సాధారణంగా స్పష్టంగా ఉన్ననూ, దాని యొక్క ఖచ్చితమైన అనువాదం చర్చనీయాంశంగా ఉంది.

3:15లో διαθήκη (*diathēkē*), అను పదము "నిబంధన" అని అనువదించబడాలా లేదా (NRSVవలె) "వీలునామా" అని అనువదించబడాలా? Josephus వ్రాతలలో, పౌలు ఉపయోగించిన *diathēkē*, అను పదము ఎల్లప్పుడు "వీలునామా" అని అర్థము. LXXలో, ఈ పదమును తరచుగా "ఒడంబడికకు" (בְּרִית, *b*ᵉ*rith*) ప్రత్యామ్నాయంగా ఉపయోగిస్తారు.[31] ఇక్కడ పదము ఎలా అనువదించబడాలి? "చిత్తమా" లేదా "ఒడంబడికా"? వచనములు 15 మరియు 17లో *diathēkē* అనగా ఒడంబడిక అను అర్థమని Morris వాదించాడు. "స్థిరపరచబడిన ఒడంబడిక అనగా రెండు పార్టీలు ఒక ఒప్పందమునకు వచ్చారు మరియు నిబంధన ఆ ఒప్పందమును వ్యక్తపరుస్తుంది" అని ఆయన చెప్పారు.[32]

"చిత్తము" అని అనువదించబడినదానికి మద్దతుగా రెండు వాదనలు ఇక్కడ ఇవ్వబడినవి: (1) సాధారణమైన విధంగా పౌలు పదమును ఉపయోగించెను (Josephus వలె) మరియు (2) "స్వాస్థ్యము" అను భాష సందర్భంలో కనుగొనబడెను (3:18). "వీలునామా" అను అనువాదమునకు మద్దతు పలుకుతూ, Boles ఈ విధంగా చెప్పాడు, "లౌకిక పరముగా "వీలునామా" అను పదము సత్యమో అదేవిధంగా మతపరముగా 'ఒడంబడిక' అను పదము కూడా సత్యమే: ఒకసారి స్థిరపరచబడిన (లేదా ధృవీకరించబడిన) తరువాత దానిని ఎవరు ప్రక్కన పెట్టలేరు (*athetei*, 'రద్దు') లేదా దానికి ఎవరు జోడించలేరు (*epidiatassetai*, 'ఒక పొల్లు కూడా జతపరచలేరు')."[33] అందువలన, వాదనలు యేర్పరచబడ్డాయి, కానీ చివరికి మాత్రం ఏదియువిలువైనది బయటపడలేదు. పౌలు చెప్పాలనుకొనినదేమనగా అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానములు మాత్రము స్థిరముగా ఉండి గౌరవించబడినవి.

రెండవ ప్రశ్న పౌలు ప్రకటనలోని చారిత్రక నేపథ్యాన్ని సూచిస్తుంది: ఆయన అది గ్రీకు లేదా హెబ్రీ చట్టం నుండి తీసుకోసెనా? William M. Ramsay గ్రీకు నేపథ్యముకు మద్దతు పలికెను. గ్రీకు ప్రపంచంలోని అనేక నగరములలో, చిత్తము అను పదమును ధృవీకరించుట అనేది ప్రభుత్వ పరంగా నమోదు చేయబడి అధికారపూర్వకంగా నమోదుచేయబడిన అసలైన లేదా ధృవీకృత కాపీపై ఆధారపడి ఉంటుంది. మునుపటిదానితో ఇది జోక్యం చేసుకొనకపోతే తప్ప, మునుపటిది ఉనికిలో ఉంటె, తరువాతది తిరస్కరించబడుతుంది లేదా రద్దుచేయబడుతుంది. విరుద్ధంగా, testator (మరణ శాసనం రాసి యుంచినవాడు) బ్రతికియుండగా రోమా ఒడంబడిక/ వీలునామా తరచుగా మార్పుచేయవచ్చు, కానీ ఆయన మరణించిన తరువాత అది మారదు (హెబ్రీ.

9:15-17 చూడండి). “తరువాతది అన్నింటిని కొట్టివేస్తుంది” అని Ramsey చెప్పాడు.[34]

**వచనము 16.** దేవుని దీవెనలు సంపాదించుకోగలిగేవి కాదుగానీ ఆయన వాగ్దానముల యొక్క ఫలము అని పౌలు ఒత్తి చెప్పాడు: **అబ్రాహామునకును అతని సంతానమునకును వాగ్దానములు చేయబడెను; ఆయన అనేకులను గూర్చి అన్నట్టు - సంతానములకును అని చెప్పక ఒకని గూర్చి అన్నట్టే - నీ సంతానమునకును అనెను; ఆ సంతానము క్రీస్తు.**

“Seed” (అది ఏకవచనమైనా లేదా బహువచనమైనా) అను అపొస్తలుని మాటను రబ్బీల యొక్క వివరణతో పోల్చవచ్చును. “Seed” లేదా సంతానము (זֶרַע, *zera‘*), అను పదము యొక్క హెబ్రీ పదము, అదే విధంగా దాని గ్రీకు భాషలోని LXXలో పదము (σπέρμα, *sperma*), **దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానముల విషయమై ఆదికాండమంతటిలో ఉపయోగించబడింది.**[35] సంఖ్య పరంగా చూస్తే ఈ పదము ఒకటేకాని ఇది సమిష్టి పదముగా ఉపయోగిచబడుతుంది. వాస్తవంగా, NASB ఈ పదమును “సంతానము”[36] అని అనువదిస్తుంది. ఆదికాండము 22:17, 18 అను వాక్యభాగము ఆక్షేపము, మరియు బహుశా పౌలు మనస్సులో ఈ లేఖనభాగము ఉండియుండవచ్చును. అక్కడ, “నీ సంతానమువలన సమస్త భూలోకములోని సమస్త జనులు ఆశీర్వదించబడుదురు” అని దేవుడు అబ్రాహాముతో చెప్పెను (ఆది. 26:4; 28:14 చూడండి).

ప్రేరేపణ చెందిన అపొస్తలునిగా, “సంతానము” అను పదము ఏకవచనము మరియు అది యేసుక్రీస్తుని సూచిస్తుందన్న సత్యములోని ప్రాముఖ్యతను పౌలు చూచాడు. ఈ ఒక్క “సంతానము” వలన - క్రీస్తులో - “సమస్త జనములు ఆశీర్వదించబడుదురు” (3:8), మరియు ఒకే “సంతానము” వలన “దేవుని కుమారులైనవారు” [దేవుని] వాగ్దానము ప్రకారము వారాసులైయున్నారు” (3:26-29).

**వచనము 17.** అబ్రాహాముతో దేవుడు చేసిన ఒడంబడికకు 3:15 లో మానవ సంబంధాల నుండి పౌలు తన దృష్టాంతములను అన్వయించారు: **నేను చెప్పునదేమనగా - నాలుగువందల ముప్పది సంవత్సరములైన తరువాత వచ్చిన ధర్మశాస్త్రము, వాగ్దానమును నిరర్థకము చేయునంతగా పూర్వమందు దేవునిచేత స్థిరపరచబడిన నిబంధనను కొట్టివేయదు.** వీలునామాలు ఒకసారి స్థిరపరచబడిన తరువాత మారకపోతే, మనుష్యులతో దేవుడు చేసిన నిబంధనలు ఇంకెంత పటిష్టంగా ఉంటాయి (మారకుండా ఉంటాయి)! ఈ ఆలోచన యేమని ఒత్తి చెప్తుందంటే సీనాయి పర్వతముపై దేవుడు మోషేకు ఇచ్చిన ధర్మశాస్త్రము, చాలాయేండ్ల క్రితం ఆయన అబ్రాహాముతో చేసిన నిబంధనను ఏ విధముచేతనైనను కొట్టివేయలేదు. ఆయన అబ్రాహాముతో చేసిన నిబంధన మొదటి ఇవ్వబడింది మరియు అది ధర్మశాస్త్రము కంటే ముందుగానే ఉంది.[37]

పైపై అధ్యయనం నుండి, అబ్రాహాముతో చేసిన వాగ్దానమును మరియు 430 యేండ్ల క్రితం మోషే ఇచ్చిన ధర్మశాస్త్రమును వేరుపరచునట్లు వాక్యభాగము మనకు కనిపిస్తుంది. ఈ పునఃనిర్మాణములోని సమస్య ఏమనగా, నిర్గమ 12:40, 41లోని హెబ్రీ

లేఖనము ప్రకారముగా, ఇశ్రాయేలీయులు ఐగుప్తులో 430 యేండ్లు గడిపారు. ఐగుప్తులో వారున్న కాలమును గూర్చి 400 అని చెప్పబడిన మరొక లేఖనభాగమునకు ఈ సంఖ్యా అనుగుణంగా ఉంటుంది (ఆది. 15:13; అపొ. 7:6).

సంఖ్యలపై ఉన్న ఈ వ్యత్యాసమునకు ఒక వివరణ ఏమనగా పౌలు సరైన పరిమాణాన్ని ఇచ్చాడు - ఈ కాలమువరకు ఇశ్రాయేలీయులు ఐగుప్తులో ఉన్నారు మరియు అది మొదలుకాకమునుపే పితరులు జీవించారు."[38] అనుసంధానమైన ఆలోచన ఏమనగా దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానము మరలా యాకోబుతో పునరావృతం చేయబడింది (ఆది. 28:14) మరియు, యాకోబు కాలములోనే ఇశ్రాయేలీయులు ఐగుప్తుకు వెళ్లారు.[39]

మరొక అవకాశమ ఏమనగా LXXలోని నిర్గమ 12:40, 41లో 430 సంవత్సరములు కనానులో పితరులు గడిపిన కాలమును మరియు ఐగుప్తులో ఇశ్రాయేలీయులు గడిపిన కాలమును సూచించు మాటలను పౌలు ఉపయోగించాడు. అలాటి సమయంలో, అపొస్తలుడిచే ఉపయోగించబడిన 430 యేండ్లు అనేది వాగ్దానము ఇవ్వబడిన సమయము నుండి ధర్మశాస్త్రము ఇచ్చు సమయమునకు మధ్య నున్న కాలమును సూచిస్తుంది. ఈ పరిష్కారములో ఉన్న సమస్య ఏమనగా ఆది 15:13 మరియు అపొ. 7:6లో ఇవ్వబడిన 400 సంవత్సరాలతో ఇది సరితూగదు.

దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనకు సంబంధించి "స్థిరపరచబడిన" అను పదము యొక్క అర్థమేమి? ఆంగ్ల పదమైన "ratified" (ఆమోదం) అను పదము ఈ సందర్భంలో రెండుమార్లు ఉపయోగించబడింది. 3:15లో, ఇది గ్రీకు పదమైన κυρόω (*kuroō*) అను పదము నుండి అనువదించబడింది, అనగా "ధృవీకరించడం," లేదా "నిర్ధారించుట," లేదా చట్టపరముగా కట్టుట" అని అర్థం. 3:17లో ఉపయోగించబడిన పదము "ముందుగానే స్థిరపరచబడెను" అని అనువదించబడెను, ఇది προκυρόω (*prokuroō*) అను పదముకు సంబంధించినది అనగా "ముందుగానే ధృవీకరించు" అని అర్థము.[40] దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానమునకు అన్వయించినప్పుడు, ఈ పదాలు దేవుడు పితరులతో వాగ్దానం చేస్తున్నాడు అని సూచిస్తుంది. హెబ్రీ 6:13 ఈ విధంగా చెప్తుంది, "దేవుడు అబ్రాహామునకు వాగ్దానము చేసినప్పుడు తనకంటే ఏ గొప్పవానితోడు అని ప్రమాణము చేయలేక పోయెను." ఈ సంఘటనను గూర్చి ఆది. 22:15-18లో కనిపిస్తుంది.

దేవుడు అబద్ధమాడనివాడు గనుక (హెబ్రీ. 6:18) అలాటి నిర్ధారణ యొక్క ఉద్దేశం ఏమనగా ఆదరణను మరియు నిరీక్షణను ఇవ్వడం. నిరీక్షణ అనేది క్రైస్తవ జీవితంలో ప్రాముఖ్యమైన అంశం (హెబ్రీ. 11:1). దయ్యాలు దేవుని నమ్ముతాయి, కానీ వాటికి నిరీక్షణ లేదు (యాకో. 2:19). నిరీక్షణ అనేది నూతన జననము మరియు అది కలిగించు రక్షణకు ప్రత్యక్ష ఫలము (1 పేతురు 1:3, 13).

**వచనము 18.** మునుపటి వాదనలపై ఆధారముచేసికొని, దేవుడు **అబ్రాహామునకు** ఇచ్చిన **వాగ్దానము** దానికంతటికదే సరిపోతుంది; మోషే **ధర్మశాస్త్రము** ఏదియు కూడా దానికి కలుపదు. నూతన నిబంధనలో దేవుని ప్రజల యొక్క **స్వాస్థ్యము**[41] అనేది ఆయన "అబ్రాహాముతో" చేసిన వాగ్దానముపై ఆధారపడి ఉండేది (మరియు ఉంటుంది)

గాని ధర్మశాస్త్రముపై కాదు. రక్షణకు అదనముగా అవసరమైనదానిని ధర్మశాస్త్రము కలిగియున్నయెడల దేవుని "వాగ్దానము లోపముతో కూడిన వాగ్దానముగా ఉంది."[42]

ఈ వివరణ వలన మనకు యేమని కనిపిస్తుందంటే, దేవుడు మానవునితో వ్యవారించుట మొదలుపెట్టినప్పటినుండి కూడా అన్నింటిలో దేవుడు కోరుకొనినది విశ్వాసము మాత్రమే. వాస్తవానికి, విశ్వాసము అనేది దేవుడు ఇచ్చిన సమయములో విధేయత ద్వారానో లేదా అవిధేయత ద్వారంనో మానవుడు ఇచ్చు స్పందన ద్వారా పరీక్షించబడేది. హెబ్రీ రచయిత ప్రకారముగా, నోవాహు ఓడను కట్టినట్లు (హెబ్రీ 11:7), అబ్రాహాము కనానుకు వెళ్లినట్లు (హెబ్రీ. 11:8-10) మరియు అబ్రాహాము ఇస్సాకును అర్పణగా ఇచ్చుటకు ఇష్టపడినట్లు (హెబ్రీ. 11:17-19) హేబెలు అర్పణ అనేది కూడా విశ్వాసము యొక్క స్పందనయే (హెబ్రీ. 11:7). అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానము యొక్క ఒడంబడికలోని ఈ నియమము యొక్క ప్రకటన మరియు నిర్ధారణ అనునది (రచనల యొక్క మోషే ఒడంబడికకు విరుద్ధముగా) గలతీలో రక్షణను గూర్చిన చర్చలో పౌలు ఎంపిక చేసుకొనిన ముఖ్యమైన విషయం. విశ్వాసుల మధ్యలో గందరగోళమును కలిగించిన యూదులతో ఉన్న తన సమస్య యొక్క స్వభావము అనునదే ఇక్కడ స్పష్టమైన విషయము.

3:18లోని **అనుగ్రహించెను** (χαρίζομαι, *charizomai*) అను క్రియాపదము, విశ్వాసము ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట దేవుని బహుమానముగా సూచిస్తుంది. క్రియల ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట (గలతీ సందర్భంలో) అనేది మనుష్యులకు సాధ్యమైన పనికాదు. క్రియల ద్వారా నీతిమంతులుగా తీర్చబడుట అనగా, పాత నిబంధనలో దేవుని యొక్క ప్రతి ఆజ్ఞకు పరిపూర్ణముగా విధేయత చూపుట అనునదియే. మనుష్యుడు స్వయం కృషితో నీతిని సంపాదించాలని కోరితే, సీనాయి పర్వతము వద్ద ఇవ్వబడిన ధర్మశాస్త్రము అనేది అతని యొక్క నిరాశాజనకమైన స్థితిని వెల్లడిపరచుటకు ఒక పరికరము మాత్రమే. మరో విధంగా, దేవుని "విశ్వాస న్యాయము" అనునది (రోమా. 3:27) మానవుని యొక్క దోషముతో మొదలౌతుంది మరియు ముగుస్తుంది, తద్వారా అతడు తన పాపమును తెలిసికొని, సిలువ చెంతకు వచ్చి, యేసు పరిపాలనకు అప్పగించుకొనును. సృష్టియైన మనము శాశ్వతముగా దేవుని మహిమను పొందులాగున, యేసు సిలువ యొద్ద పాపము యొక్క సారసంగ్రమం అగుట ద్వారా తండ్రి ప్రేమను ప్రదర్శించెను (2 కొరింథీ. 5:21; 8:9).

ఇది అబ్రాహామునకు మరియు అతని సంతానమునకు- విశ్వాసముంచు మనకు వాగ్దానము చేయబడిన ఆశీర్వాదం. ఈ ఆశీర్వాదములను అవిశ్వాసపు ప్రపంచమునకు పంచుటకు మేము కోరిక కలిగియున్నాము. దేవుడు ఖచ్చితంగా అబద్ధమాడనట్లుగా, నజరేయుడైన యేసు, సిలువవేయబడిన ప్రభువుననందు విశ్వాసముంచుటద్వారా దేవుని పిల్లలలందరికీ ఈ వాగ్దానము ఇవ్వబడింది.

# ధర్మశాస్త్రము యొక్క అసమర్థత (3:19-22)

**[19]అలాగైతే ధర్మశాస్త్రమెందుకు? ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములను బట్టి దానికి తరువాత ఇయ్యబడెను; అది మధ్యవర్తి చేత దేవదూతల ద్వారా నియమించబడెను. [20]మధ్యవర్తి యొకనికి మధ్యవర్తి కాడు గాని దేవుడొక్కడే. [21]ధర్మశాస్త్రము దేవుని వాగ్దానములకు విరోధమైనదా? అట్లనరాడు. జీవింపజేయు శక్తిగల ధర్మశాస్త్రము ఇయ్యబడి యున్నయెడల వాస్తవముగా నీతిధర్మశాస్త్ర మూలముగానే కలుగును గాని [22]యేసు క్రీస్తునందలి విశ్వాస మూలముగా కలిగిన వాగ్దానము విశ్వసించువారికి అనుగ్రహింపబడునట్లు, లేఖనము అందరిని పాపములో బంధించెను.**

**వచనము 19.** తమ మధ్యలో ఉన్న తన చదవరుల నుండి మరియు/లేదా యూదావాదుల నుండి సవాలును ఎదురుచూస్తూ, అపొస్తలుడు ఇక్కడ **అలాగైతే ధర్మశాస్త్రమెందుకు** అనే చాలా ప్రాముఖ్యమైన ప్రశ్న అడుగుతున్నాడు. తన చర్చ తరువాత, ధర్మశాస్త్రమునకు ఒక ఉద్దేశమే లేకుండా ఉన్నట్లుగా అనిపించింది. NIV అనువాదములో "అలాంటప్పుడు, ధర్మశాస్త్రమెందుకు అసలు ఇవ్వబడినది?" అనే ప్రశ్న ఉంది. NKJV అనువాదము ప్రకారము, "ఎటువంటి ఉద్దేశమును ధర్మశాస్త్రము కలిగి ఉంది" అనే విధంగా ప్రశ్న ఉంది. ఈ రెండు అనువాదములు కూడా ఇక్కడి ఆలోచనను ఉన్నది ఉన్నట్లుగానే అనువదించాయి. ఈ ప్రశ్నకు జవాబు అనుకున్నంత సులువు కాదు. చాల స్పందనలు (ప్రత్యేకముగా పాపముతో కూడుకున్న సమాధానాలు) ఇవ్వవచ్చు, కానీ ఈ క్రింది వాటిని గమనించగలరు:

పరిశుద్ధుడైన, వ్యక్తిగత దేవుని గూర్చిన ఒక స్పష్టమైన బయలుపాటు కొరకు (రోమా. 1:18-20);
పాపము మరియు అపరాధము యొక్క లక్షణములను బయలుపరచడానికి (రోమా 3:9-20);
సమీపింపరాని తన తేజస్సును గూర్చియు తన ప్రజలందరి నుండి తాను ఆశిస్తున్న పరిశుద్ధతను గూర్చియు తన ప్రజలకు బోధించుటకు (1 పేతురు 1:15, 16; చూడండి నిర్గమ. 19:10-25; యెషయా 6:1-8);
హెచ్చరికలతో కూడిన ఉదాహరణలతో మరియు కృపగల వాగ్దానములతో పరిశుద్ధత పట్ల ప్రజలు ప్రోత్సహింపబడులాగున వారిని రేకెత్తించడానికి (రోమా. 11:22; 15:4; 1 కొరింథీ. 10:1-13; యూదా 5-8);
దేవుని జనాంగముగా ఇశ్రాయేలీయులు పాపమునకు దూరముగా ఉండి సరైన ప్రవర్తనను వారికి బోధించుటకు (గలతీ. 4:1-3);
తమ అపరాధము యొక్క తీవ్రతను ప్రజలందరూ గుర్తించులాగున వారిని చేయుటకు (3:10; రోమా. 5:20);
తమ సొంత ప్రయత్నముల ద్వారా ప్రజలు తమను తాము రక్షించుకొనే

ప్రయత్నం చేస్తుంటే అట్టి ప్రయత్నము యొక్క వైఫల్యతను వారికి తెలియజేయడానికి (రోమా. 10:1-3; ఫిలిప్పీ. 3:7-9);

ప్రవచనముల ద్వారా మరియు ప్రవక్తల దర్శనముల ద్వారా రాబోవుచున్న విమోచకుడు/మెస్సీయ (యోహాను 5:39)ను గూర్చిన సాక్ష్యమిచ్చుటకు (లూకా 24:25-27; రోమా. 16:25, 26);

మానవుని శిక్షావిధి యొక్క పరిధిని బయలుపరచుట ద్వారా దేవుని కృప యొక్క లోతును చూపుటకు (రోమా. 5:20, 21).

పౌలు ఈ సమాధానమును ఇస్తున్నాడు: **ఎవనికి ఆ వాగ్దానము చేయబడెనో ఆ సంతానము వచ్చువరకు అది అతిక్రమములనుబట్టి దానికి తరువాత ఇయ్యబడెను.** ధర్మశాస్త్రము దేనికి "కలుపబడినది?" పౌలు రెండు నిబంధనలను గూర్చి మాట్లాడుతున్నాడు - మోషేకు ఇవ్వబడిన ధర్మశాస్త్రమనబడే నిబంధన మరియు అబ్రాహామునకు ఇవ్వబడిన వాగ్దానము అనబడే మునుపటి నిబంధన. తరచు చెప్పబడినట్లుగా, ధర్మశాస్త్రము అనునది కూడా అబ్రాహామునకు వాగ్దానము ఇవ్వబడిన తరువాత మొదలుకొని (3:17) క్రీస్తు అనబడే "సంతానము" (3:16) వచ్చునంతవరకు ఉంచబడిన ఒక కుండలీకరణలా ఉంది. ధర్మశాస్త్రము క్రీస్తును చూపించింది, మరియు వాగ్దానము ఆయనలోనే పరిపూర్ణమైంది (చూడండి యోహాను 1:17). క్రీస్తు మరణములో కుండలీకరణము ముగిసిన తరువాత, ధర్మశాస్త్రము యొక్క కాలము సంపూర్ణమై క్రీస్తు యొక్క రక్తముచేత క్రొత్తనిబంధన ధ్రువీకరించబడినది (చూడండి హెబ్రీ. 9:17-28).[43]

ఇట్లుండగా, ధర్మశాస్త్రము ఎందుకు అదనముగా ఇవ్వబడింది? "అతిక్రమములనుబట్టి" అని పౌలు ఇచ్చిన సమాధానమును రెండు విధాలుగా అర్థము చేసుకొనవచ్చు.

ఒక విధానము ఏమనగా "బట్టి" అనే మాట (χάριν, *charin*)ను ధర్మశాస్త్రము యొక్క *లక్ష్యముగా* చెప్పడం (అంటే, "అతిక్రమములను *వెలుగులోనికి తెచ్చుటకు*"). ఈ లేఖనము యొక్క ఈ విధమైన విశదము క్రొత్తనిబంధనలోని ఇతర వాక్యభాగములచే కూడా బలపరచబతుతుంది. ధర్మశాస్త్రము అనునది పాపమును నిర్వచించింది (రోమా. 3:20; 4:15); నిజానికి, అది పాపమును రేకెత్తించింది కూడా (రోమా. 7:7-11) మరియు పాపమును పెంచింది (రోమా. 5:20). ధర్మశాస్త్రము లోకమును శిక్షించింది! మెట్టుకు, పాపము నుండి మానవునికి రక్షణ అవసరము కానీ ఈ రక్షణను తనంతట తానే పొందుకొనలేడని బయలుపరచింది. ప్రజలు పాపమును బట్టి ఒప్పింపబడుట వలన దేవుని కృప యొక్క అవసరత వారిలో కలిగింది. ఈ విధంగా, రక్షకుని ఆగమనము కొరకు ధర్మశాస్త్రము ఎదురుచూచి మరియు ఆ రక్షణకు, అనగా కాలము సంపూర్ణమైనప్పుడు యేసు తననుతాను అర్పించుకొనుట ద్వారా ఈ లోకమునకు తేవలసిన రక్షణకు సమ్మిళితముగా ఉంది.

రెండవ విధానము ఏమనగా "బట్టి" (*charin*) అనే మాటను ధర్మశాస్త్రమునకు గల *కారణమును* సూచిస్తున్నదిగా తీసుకోవడం (అంటే, "చేయబడిన అతిక్రమములను

*పరిగణించడానికి*"[44]). ఈ అధ్యాయములోని తరువాత భాగములో ధర్మశాస్త్రము "బాలశిక్షకుడు"గా లేదా "సంరక్షకుడు"గా పరిగణింపబడిన ఊహాచిత్రాల ద్వారా (3:23-25పై గల వ్యాఖ్యలను చూడండి) ఈవిధమైన విధానమునకు బలము చేకూరుతుంది. దేవుని ప్రజలు ధర్మశాస్త్రము క్రింద ఉన్నప్పుడు ("బాలశిక్షకుని"), వారిని పాపమునుండి దూరపరచి వారు తిరుగుబాటు చేసినప్పుడు వారిని శిక్షించడమే దాని ఉద్దేశము. మెస్సీయ రాకడ పర్యంతము దేవుని ప్రజలను పాపము సరైన మార్గములో ఉంచడమే ధర్మశాస్త్రము యొక్క పని.

ధర్మశాస్త్రము **మధ్యవర్తిచేత దేవదూతల ద్వారా నియమింపబడెను** అని పౌలు ఉద్ఘాటిస్తున్నాడు. దేవుడు అబ్రాహాముతో (ప్రత్యక్షముగా) చేసిన వాగ్దానముతో (పరోక్షముగా ఇవ్వబడిన) ధర్మశాస్త్రమును వ్యత్యాసపరచడానికి ఈ వివరణలను పౌలు ఇచ్చాడు. దాని వ్యక్తిగత స్వభావమును బట్టి, అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానము దీనికంటే మిన్నైనదిగా చూపబడింది. ధర్మశాస్త్రము యొక్క దైవిక ఉద్భవమును లేదా దానిలోని ఆజ్ఞల "పరిశుద్ధతను నీతిని ఉత్తమతత్వమును" (రోమా. 7:12) పౌలు ఇక్కడ తిరస్కరించడం లేదు. ఏమైనను, ధర్మశాస్త్రమును దేవుడు మోషేకు అందించిన విధానములోనే అదే దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానము మిన్నయైనదిగా కనబడుతుంది.

మోషే ధర్మశాస్త్రము యొక్క నిర్మాణములో దేవదూతలు కూడా పాలుపొందాయి అనే సంగతి నిర్గమకాండములో చెప్పబడలేదు. తన "దూత" ఇశ్రాయేలీయులను నడిపిస్తుందని దేవుడు నిర్గమకాండము 32:34లో వాగ్దానము చేసాడు. సీనాయి పర్వతముమీద ధర్మశాస్త్రమును ఇచ్చిన రెండు సంఘటనలకు (నిర్గమ. 24:15-32:16; 34:1-29) నడుమ ఈ వాక్యభాగము ఉంచబడి ఉంది. అయినప్పటికీ, ఆ కథనములలో ఏ ఒక్క దూత కూడా ప్రస్తావించబడలేదు. ద్వితీయోపదేశకాండము 33:2లో, "వేవేల పరిశుద్ధ సమూహముల మధ్యనుండి" లేదా "దూతల" (LXX) నుండి దేవుడు దిగివచ్చినట్లుగా చిత్రీకరించబడి ఉంది.

కాగా, క్రొత్తనిబంధనలో మోషేను స్తెఫను "సీనాయి పర్వతముమీద తనతో మాటలాడిన దేవదూతతోను మన పితరులతోను అరణ్యములోని సంఘమందు ఉండి మనకిచ్చుటకు జీవవాక్యములను తీసికొనినవాడి"గా చెప్పాడు (అపో. 7:38). ప్రజలు "దేవదూతల ద్వారా నియమింపబడిన ధర్మశాస్త్రమును పొందినవారి"గా చెప్పాడు (అపో. 7:53). ధర్మశాస్త్రము "దేవదూతల ద్వారా పలుకబడిన"ట్లుగా హెబ్రీ పత్రిక రచయిత చెప్పాడు (హెబ్రీ. 2:2). అప్రేరేపిత యూదా సాహిత్యము కూడా దూతలను మోషే ధర్మశాస్త్ర నిర్మాణముతో ముడిపెట్టి చూపుతుంది.[45] ఇప్పటివరకు పాతనిబంధనలో నుండి మనం చూచిన వాక్యభాగముల ఆధారముగా ఈ ఆలోచన చేయబడి ఉండవచ్చు, మరియు కీర్తన 68:17 కూడా: "దేవుని రథములు సహస్రములు సహస్రసహస్రములు ప్రభువు వాటిలో నున్నాడు సీనాయి పరిశుద్ధమైనట్టు ఆ కొండ పరిశుద్ధమాయెను."

దేవునికి మరియు ప్రజలకు "మధ్యవర్తి"గా (μεσίτης, *mesitēs*) మోషే యొక్క పాత్ర స్పష్టముగా ఉంది. నిర్గమకాండము 20:19లో, ప్రజలు మోషేతో "నీవు మాతో మాటలాడుము మేము విందుము; దేవుడు మాతో మాటలాడిన యెడల మేము

చనిపోవుదుము" అని చెప్పారు. ద్వితీయోపదేశకాండము 5:5లో "నేను యెహోవాకును [ప్రజలకును] మధ్యను నిలిచియుండగా యెహోవా ఈలాగున సెలవిచ్చెను" అని మోషే జ్ఞాపకము చేసుకొనుచున్నాడు.

19వ వచనములో "మధ్యవర్తి" అనే పదము "చేతుల మీదుగా" (ἐν χειρὶ, *en cheiri*) అనే అక్షరార్థ పదముల యొక్క మంచి అనువాదము. దీనికి సమాంతర వాక్యము లేవీయకాండము 26:46లో ఉంది: "యెహోవా మోషేద్వారా సీనాయికొండమీద తనకును ఇశ్రాయేలీయులకును మధ్య నియమించిన కట్టడలను తీర్పులును ఆజ్ఞలును ఇవే" (ఉద్ఘాటన జోడించబడినది). "ద్వారా" అనే మాటకు బదులు, హెబ్రీ భాషలో "చేతి మీదుగా" (בְּיַד, *b^e^yad*) అని ఉంది (KJV చూడండి).

**వచనము 20. మధ్యవర్తి యొకనికి మధ్యవర్తి కాడు గాని దేవుడొక్కడే.** ఈ వాక్యము అంతటి యొక్క అర్థము స్పష్టము కాదు. ఈ వచనములో కష్టముగా అనిపించని రెండు స్వతంత్ర భాగములు ఉన్నాయి. మొదటి భాగములో "మధ్యవర్తి" అనేవాడు "యొకనికి మధ్యవర్తి" కాదు, కాని ఇద్దరికి అనే మాట ఉంది. మునుపు పేర్కొన్నట్లుగా, సీనాయి పర్వతముమీద ఉన్న దూతకును ఆ పర్వతమునకు దిగువున కూడుకొనియున్న ఇశ్రాయేలీయులకును మధ్యవర్తిగా మోషే ఉన్నాడు అని అపొస్తలుల కార్యములు 7:38 చూపుతుంది. రెండవ భాగము దేవుని యొక్క ఏకత్వమును ఉద్ఘాటిస్తుంది. దేవుని యొక్క ఈ ఏకత్వమే యూదా విశ్వాసమునకు ప్రధానమైనదిగా ఉండినది (మరియు ఇప్పటికీ ఉంటుంది). ప్రతిరోజు యూదులచే షేమా, అనగా "ఇశ్రాయేలూ వినుము. మన దేవుడైన యెహోవా *అద్వితీయుడగు యెహోవా*" (ద్వితీయ. 6:4; ఉద్ఘాటన జోడించబడినది) చెప్పబడుతుంది.

ఈ వచనమంతటి యొక్క సంపూర్ణ వివరణ ఈ విధంగా ఉంది: ఇది (ప్రజల కొరకు దేవునిచే దూతల *ద్వారా* మరియు మోషే *ద్వారా* ఇవ్వబడిన) ధర్మశాస్త్రమునకు మరియు (దేవునిచే అబ్రాహామునకు *ప్రత్యక్షముగా* ఇవ్వబడిన) ఉన్నతమైన వాగ్దానమునకు మధ్య ఉన్న వ్యాత్యాసములను చూపేది.

**వచనము 21.** మోషే యొక్క ధర్మశాస్త్రము మరియు అబ్రాహామునకు ఇవ్వబడిన వాగ్దానము ఈ రెండూ ఒకదానితో ఒకటి విరోధముగా ఉన్నాయి అని కొందరు నమ్మినట్లుగా పౌలు యొక్క వాదన చేసి ఉంటుంది. ఇటువంటి విపరీత ఆలోచనను ఎదిరించడానికే, పౌలు **ధర్మశాస్త్రము దేవుని వాగ్దానములకు విరోధమైనదా? అట్లనరాదు** అని వ్రాసాడు. ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశము **జీవింపజేయు శక్తి** ఇవ్వడం, లేదా పాపులను నీతిమంతులుగా తీర్చడం కాదు అని పౌలు ఉద్ఘాటించాడు. **ధర్మశాస్త్రము మూలముగానే** ఎవడును నీతిమంతుడుగా చేయబడలేడు. కానీ, నీతిమత్వము అనునది అబ్రాహాము సంతానము ద్వారా, అనగా క్రీస్తు ద్వారా, సమస్త వంశములను ఆశీర్వదిస్తానని దేవుడు చేసిన వాగ్దాన నెరవేర్పు (రోమా.7; 8 చూడండి). ఈ రెండూ ఒకే ఉద్దేశమును నెరవేర్చలేదు కానీ ఒకదానికి మరొకటి పరిపూరకరమైనవిగా ఉన్నాయి.

**వచనము 22. యేసుక్రీస్తునందలి విశ్వాస మూలముగా కలిగిన వాగ్దానము విశ్వసించువారికి అనుగ్రహింపబడునట్లు, లేఖనము అందరిని పాపములో బంధించెను**

అని చెప్తూ పౌలు ముగించాడు. "లేఖనము" అనగానేమి? ఈ వాక్యము మానవుని పాపములకు సాక్ష్యము పలుకుచున్న పాతనిబంధనకు ఒక మామూలు ప్రస్తావనగా చెప్పవచ్చు. అనేక పాతనిబంధన వాక్యములను ఒకదానితో మరొకటి ముడిపెట్టడం ద్వారా రోమీయులకు 3:10-18లో అపొస్తలుడు ఈ విషయమునే రుజువుపరచాడు.

"లేఖనము" (ἡ γραφή, *hē graphē*) అనేది ఇక్కడ ఏకవచనము గనుక, బహుశ పౌలు ఒక ప్రత్యేకమైన వాక్యమును గూర్చి మాట్లాడుతున్నాడేమో.[46] సాధ్యమగు ఒక వాక్యభాగము గలతీయులకు 2:16లో సూచించబడిన కీర్తనలు 143:2, "ధర్మశాస్త్ర సంబంధ క్రియలమూలమున ఏ శరీరియు నీతిమంతుడని తీర్చబడడు గదా." ఇది సూచించుచున్న మరొక వాక్యభాగము గలతీయులకు 3:10లో సూచించబడిన ద్వితీయోపదేశకాండము 27:26లోని వాక్యము: "ధర్మశాస్త్రగ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు అని వ్రాయబడియున్నది."

తరువాత, "లేఖనము" అనే పదము ధర్మశాస్త్రమునకే సమానమైన పదముగా కూడా ఉంది. దేవుని ప్రజలను పాపులుగా ఒప్పింపజేసిన ధర్మశాస్త్రము యూదులను పాపులుగానే బందీచేసింది.

దేవుని ప్రజల పాపపు స్థితిని చూపడం ద్వారా, పౌలు విశ్వాస సూత్రమునకు మార్గమును సరాళము చేసాడు: దేవుని యొక్క వాగ్దానములు "యేసుక్రీస్తునందలి విశ్వాసము వలననే" వస్తాయి కాని ధర్మశాస్త్ర సంబంధ క్రియల మూలముగా కాదు.

## ధర్మశాస్త్రము యొక్క తాత్కాలికమైన స్వాభావము: క్రీస్తు వైపుకు నడుపుతున్న బాలశిక్షకుడు (3:23-29)

**23విశ్వాసము వెల్లడికాకమునుపు, ఇక ముందుకు బయలుపరచబడబోవు విశ్వాసమవలంబింపవలసిన వారముగా చెరలో ఉంచబడినట్టు మనము ధర్మశాస్త్రమునకు లోనైన వారమైతిమి. 24కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తునొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను. 25అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుని క్రింద ఉండము. 26యేసు క్రీస్తునందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులై యున్నారు. 27క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు. 28ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసు క్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు. 29మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమై యుండి వాగ్దాన ప్రకారము వారసులై యున్నారు.**

**వచనము 23.** గ్రీకు లేఖనములో, **విశ్వాసము** ఒక నిర్దిష్టోప పదమునకు (τὴν πίστιν, *tēn pistin*) ముందు వస్తుంది, కాబట్టి ఈ పదమును "విశ్వాసము" అని

అనువదించవచ్చు. ఇది క్రొత్త నిబంధన యొక్క ఖచ్చితమైన బోధకు సూచనగా ఉందని కొందరు ఆలోచించుటకు కారణమౌతుంది (యూదా 3లో ఉన్నట్లుగా). ఈ ఆలోచన వచనం యొక్క ప్రణాళికతో సరిపోయేటప్పుడు, 3:22లో ఉన్నట్లుగా "విశ్వాసము" కర్త సంబంధిగా ఇక్కడ ఉపయోగించవచ్చు ("యేసు క్రీస్తులో విశ్వాసము"). ఒకవేల వ్యాఖ్యానము అదే కాల వ్యవదికి సంబంధించినదై ఉంటుంది - క్రీ.శ. మొదటి శతాబ్దము - యేసు యొక్క పరిచర్య మరియు అయన యొక్క సంఘు స్థాపన జరిగినప్పుడు.

ఈ సమయమునకు మునుపు, యూదులు **విశ్వాసము వెల్లడికాకామునుపు ముందుకు బయలుపరచబోవు విశ్వాసమవలంబింపవలసిన వారుగా ధర్మశాస్త్రమునకులోనైయున్నారు.** "లోనైయున్నారు" (φρουρέω, *phroureō*) అను వాక్యము మరియు "చెరలో ఉంచబడినట్టు" (συγκλείω, *sunkleiō*) అను వాక్యము ఖైదు నిర్బంధమునకు సంబంధించినదిగా కనిపిస్తుంది. ధర్మశాస్త్రము అనునది జైలు సంరక్షకుడిగా చిత్రీకరించబడింది. ఖైదీల యొక్క కేసులు కొట్టిపేయబడునంతవరకు కూడా వారు చెరసాలలో ఉన్న విధానము గూర్చి రోమా వాడిన పదములతో సరితూగుతుంది *phroureō* అను పదము.[47] అయితే, ఈ సందర్భంలో, వచనము 24 మరియు 25లో ఈ పదములు "బోధకుని" పాత్రకు సంబంధించినది. ఈ విషయంలో, బోధకుని వలె, చట్టము అమలులో ఉండగా ఒక నిర్బంధ శక్తిగా పనిచేసింది.

**వచనము 24.** పౌలు కొనసాగిస్తూ, **కాబట్టి మనము విశ్వాసమూలమున నీతిమంతులమని తీర్చబడునట్లు క్రీస్తు నొద్దకు మనలను నడిపించుటకు ధర్మశాస్త్రము మనకు బాలశిక్షకుడాయెను.** "బాలశిక్షకునికి" గ్రీకు పదము, παιδαγωγός (*paidagōgos*), ఇది ἀγωγός (*agōgos*, "నాయకుడు") అను పదముతో παῖς (*pais*, "బాలుడు") అను పదమును చేర్చే ఒక సమ్మేళన పదము. పదము యొక్క అక్షరార్థం ఏమనగా ఒక "బాలశిక్షకుడు." ఇతర వెర్షన్లు ఈ పదమును "పోషకుడు" (RSV) అని, క్రమశిక్షకుడు" (NRSV) అని, లేదా "సంరక్షకుడు" (ESV) అని అనువదిస్తాయి. సాంప్రదాయక అనువాదమైన "పాఠశాల ఉపాధ్యాయుడు" (KJV) అనునది సరిగ్గా వ్యక్తిగా సూచించదు.[48] ఒక *paidagōgos* అనువాడు, ఒక యువకుడు పరిపక్వతకు చేరేవరకు ఆయనకు కావలసిన మార్గదర్శకత్వమును ఇచ్చుటలో బాధ్యత వహించు కుటుంబ దాసుడు. ఆయన పాఠశాల ఉపాధ్యాయుడు లేదా ఉపాధ్యాయుడు (διδάσκαλος, *didaskalos*), కాదు గానీ అబ్బాయిని క్లాసుకు నడిపించువాడు. ఆయన నైతిక బాలశిక్షకుడుగా, రక్షకుడిగా, మరియు కఠినమైన క్రమశిక్షకుడిగా పనిచేస్తాడు.[49]

*Paidagōgos*ను ఉపయోగించు ఆచారము సుమారు క్రీ.పూ. ఐదవ శాతబ్దంలోనిది, బహుశా గ్రీసులో ఉద్భవించి ఉండవచ్చును.[50] దీనిని ఎక్కువగా రోమీయులు మరియు గ్రీకులు ఉపయోగించేవారు. కొంతమంది ధనికులైన యూదులు కూడా ఈ ఆచరణను పాటించేవారు.

స్వేచ్ఛగా-పుట్టిన బాలుడు తన సంరక్షకుని విడిచిపెట్టిన తరువాత, వ్యక్తిగత బానిస బాలుని వ్యవహారాలన్నిటిని చూచుకోవాలి. ఇది పరిపూర్ణ సమయ ఉద్యోగం: ఉదయం సంరక్షకుడు బాలుడిని లేపాలి మరియు రాత్రికి అతనిని పండుకోబెట్టాలి.[51] ఆ బాలునికి

మంచి అలవాట్లు నేర్పడం అనగా కూర్చోడం, మంచిగా నడవడం, పెద్దల యెదుట లేచి నిలువబడుట, తక్కువగా తినుట, అల్లరి చేయకుండా ఉండుట నేర్పించడం ఈ బానిస/దాసుని బాధ్యత.[52] ఆ బాలుడు అవిధేయుడైతే, ఆ దాసుడు అతనిని కొరడాతో లేదా కడ్డీతో కొట్టేవాడు.

బాలుడిని పాఠశాలకు తీసుకువెళ్లేడప్పుడు, *paidagōgos* అతని పలకను, అతని పుస్తకములను, మరియు అతని వాయిద్యములను (బహుశ వీణ లేదా పిల్లనగ్రోవి) మోయాలి. ఆ దాసుల కొరకు ఏర్పాటు చేయబడిన ప్రత్యేక గదిలో లేదా క్లాసులో దాసుడు వేచియుండాలి. క్లాసు ముగిసిన తరువాత, అతడు పాఠములను చెప్పిస్తూ ఆ బాలుడిని ఇంటికి నడిపించాలి. పిల్లవానికి వ్యవహారదశ రానప్పుడు, దాసుడు అతడి స్వాతంత్ర్యంపై అవసరమైన నిర్బంధాన్ని విధించేవాడు, వ్యవహారదశకు చేరుకున్నప్పుడు, తన స్వాతంత్ర్యమును మంచిగా ఉపయోగించుకుంటాడను నమ్మకం ఉంటుంది."[53]

ఏడవ ఏడు మొదలుకొని యవ్వనంలోకి వచ్చువరకు కూడా ఆ చిన్నవాడు సంరక్షకుని పర్యవేక్షణలో ఉండాలి. ఈ సంబంధం ముగియబడే ఖచ్చితమైన సమయం అనేది "తండ్రి ఏర్పరచిన తేదిపై" ఆధారపడి ఉంటుంది (4:2). యొవ్వనుడు పరిపక్వమునకు చేరుకున్నప్పుడు, అతడు పర్యవేక్షణనుండి విడుదలైపోతాడు. *Paidagōgos* Xenophon's వివరణ మనకు సహాయ పడుతుంది: "ఒక బిడ్డ బాల్యమును విడచి, పిల్లవాడిగా/బాలుడి దశను ప్రారంభించుచుండగా, ఇతరుల తనను తన సంరక్షకుని [*paidagōgos*] యొద్ద నుండి మరియు పాఠశాల ఉపాధ్యాయుని [*didaskalos*] నుండి విడిపిస్తారు: అప్పుడు అతడు పాలకుని నియంత్రణలో ఉండక, తన సొంత నిర్ణయము చొప్పున నడుస్తాడు."[54] ఒక బాలుడు తన సంరక్షకుని నుండి లేదా ఉపాధ్యాయుని నుండి విడుదల పొందినప్పుడు, చిన్ననాటినుండి నేర్చుకున్నట్టువంటి నియమాలను (στοιχεῖα, *stoicheia*) అతని మరువకూడదు లేదా విడువకూడదు.

క్రీస్తులో (పరిపక్వతలో) విశ్వాసముండునట్లు ప్రజలను సిద్ధపరచుటకు ధర్మశాస్త్రమనేది ఒక ప్రాముఖ్యమైన పనిగా కొనసాగింది. దేవుని వ్యక్తిత్వమును గూర్చియు మరియు పాపములకు ప్రాయశ్చిత్తము కలిగించుట గూర్చియు యూదులకు హెచ్చరించింది. యేసు ద్వారా వచ్చు రక్షణలో వారిని నడిపించుటకు ఈ ప్రాముఖ్యమైన విషయాలు తప్పనిసరి.

**వచనము 25.** సంరక్షకుని వలె, ధర్మశాస్త్రము కూడా కొంతకాలము వరకు మాత్రమే పనిచేసెను. **అయితే విశ్వాసము వెల్లడియాయెను గనుక ఇక బాలశిక్షకుకి క్రింద ఉండము** అని పౌలు వివరించెను. సర్వనామము "మనము" ఉపయోగించుట ద్వారా అతడు మరియు అతని యొక్క తోటి యూదులు ధర్మశాస్త్రము నియంత్రణలో లేమని చెప్పాడు. క్రీస్తు యుగము - పరిపక్వ యుగము వచ్చువరకు కూడా దేవుని ప్రజల ప్రవర్తనను క్రమబద్ధీకరించుట దాని ఉద్దేశము. ఒకడు తన జీవన విధానము కొరకు ధర్మశాస్త్రము యొద్దకు తిరిగి వెళ్లుట అనేది ఒక యువకుడు విడువబడిన పిమ్మట తిరిగి తన సంరక్షకుని యొద్దకు వెళ్లినట్లుంటుంది. అతడు వయస్సుకు వచ్చిన తరువాత అతడు పొందుకున్న స్వాతంత్ర్యమును, హక్కులను, మరియు సౌకర్యములను

విడిచిపెట్టటం (గలతీ. 4:1-7)."[55]

**వచనము 26.** పౌలు మొదటి వ్యక్తి బహువచనము నుండి ("మనము" యూదులు) రెండవ వ్యక్తి బహువచనమునకు ("మీరు" గలతీ క్రైస్తవులు) మారెను. అతడు ప్రత్యక్షంగా తన పాఠకులతో మాట్లాడుతున్నాడు, వారిలో యూదా మరియు అన్య క్రైస్తవులు ఉన్నారు. అపొస్తలుడు ఇలా వ్రాసాడు: **యేసుక్రీస్తు నందు మీరందరు విశ్వాసము వలన దేవుని కుమారులైయున్నారు.** పౌలు కావాలని "దేవుని కుమారులు" అను పదసమూహమును ఉపయోగించెను, ఎందుచేతననగా, యూదులలో అటువంటి వాక్యము కేవలము ఇశ్రాయేలీయులకు మాత్రమే వర్తిస్తుంది.[56] మొదటి శతాబ్దం సమీపంలో వ్రాయబడిన యూదుల వ్రాతలలో ఇది కనిపిస్తుంది.[57] అపొస్తలుడు ఆ వాక్యమును యూదులేమి లేదా అన్యులేమి, క్రైస్తవులందరికీ వర్తించునట్లు ఉపయోగించాడు.

వారందరు "దేవుని కుమారులు" - ధర్మశాస్త్రమును నిష్ఠగా పాటించుటను బట్టి కాదుగానీ "క్రీసుయేసు నందు వారికున్న విశ్వాసమును బట్టి." వారు దేవుని యొక్క ఆత్మీయ కుటుంబములో చేర్చబడి, ఆయనను పోలి ఉండి మరియు ఆయన ఆత్మ ద్వారా నింపబడితిరి (రోమా. 8:9-17). కొన్ని వెర్షన్లు స్త్రీపురుష బేధం లేకుండా అనువదిస్తారు (ఉదాహరణకు, NRSVలో పిల్లలు), ఇక్కడ మాత్రం గ్రీకు భాషలో "కుమారులు" అని ఉంది (υἱοὶ, *huioi*). వారసత్వ సంభావ్యత వలన ఈ ప్రత్యేకమైన వాక్యమునకు ప్రాముఖ్యత ఉంది. ప్రాచీన ప్రపంచంలో, సహజంగా కుమారులు వారసత్వమును పొందేవారు.

**వచనము 27.** విశ్వాస నియయమును గూర్చి వివరించిన పిమ్మట, **క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు** అని పౌలు కొనసాగించెను. సువార్త సందేశము యెడల విశ్వాసముంచిన తరువాత గలతీయులు "బాప్తిస్మము" (βαπτίζω, *baptizō*) పొందారు, అనగా నీళ్లలో ముంచబడితిరి.[58] దక్షిణ గలతీయలో మొదటి సువార్త ప్రయాణముకు సంబంధించి అపొస్తలుల కార్యములు బాప్తిస్మమును గూర్చి చెప్పలేదు. పిసిదియలోనున్న అంతియొకయలో "విశ్వసించిన" అన్యులను గూర్చి (అపొ. 13:14, 48), ఈకొనియాలో "విశ్వసించిన" యూదులు మరియు అన్యులను గూర్చి (అపొ. 14:1), మరియు దెర్బేలో "అనేకమందిని శిష్యులనుగా" చేసెను (అపొ. 14:20, 21) అని మాట్లాడుతుంది. అయితే, "విశ్వసించు" అనునది అపొస్తలుల కార్యములోని పూర్తి మారుమనస్సు క్రమమును సూచిస్తుంది. అలా ఉపయోగించినప్పుడు, ఆ పదము యొక్క అర్థములో విశ్వాసము, మారుమానస్సు, ఒప్పుకోలు, మరియు బాప్తిస్మము కూడా ఉంటాయి.

క్రీస్తులో రక్షణకు మరియు సంఘములో ప్రవేశమునకు అవరసమైన నీటి బాప్తిస్మము సువార్తలలో (మత్తయి 28:19; మార్కు 16:16; యోహాను 3:5), అపొస్తలుల కార్యములలో (అపొ. 2:38, 41; 8:38; 10:47, 48; 16:15, 33; 18:8; 19:5; 22:16), పత్రికలలో (రోమా. 6:3, 4; 1 కొరింథీ. 6:11; 12:13; కొలస్సీ. 2:12; తీతు. 3:5; 1 పేతురు 3:21) ఒత్తి చెప్పబడింది. ఒక వ్యక్తి "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందినప్పుడు" అతడు ఆయనతో ఏకమౌతాడు మరియు ఆయన మరణము మరియు

పునరుత్థానము వలన వచ్చు ఆశీర్వాదములను పొందుకుంటాడు. వాస్తవానికి, బాప్తిస్మము సంఘటన అనేది క్రీస్తు మరణమును, పాతిపెట్టుటను, మరియు పునరుత్థానమును గుర్తు చేస్తుంది. విశ్వాసి నీటి బాప్తిస్మమందు పాపము విషయమై మరణించి నూతన జీవముతో లేస్తాడు (రోమా. 6:3, 4; కొలస్సీ. 2:12). ఇక్కడ, "క్రీస్తును . . . ధరించుకొనియున్నారు" అని పౌలు చెప్పాడు అనగా ఆయన నీతిని ధరించుకొనుటను సూచిస్తుంది (2 కొరింథీ. 5:21 చూడండి). ఆత్మీయ విధంగా, బాప్తిస్మము అనగా నూతన వస్త్రములను ధరించుట. పాపము యొక్క మురికిగుడ్డలను ధరించుటకు బదులుగా (యెషయా 64:6), క్రైస్తవులు క్రీస్తు యొక్క నీతి వస్త్రములు ధరించుకొన్నారు (ప్రకటన 3:4; 6:11 చూడండి). మనము ఆయన "లక్షణములను, ధర్మములను మరియు ఉద్దేశములను తీసుకొనుటకు ఇష్టపడుతున్నాము."[59]

వచనము 28. ఈ రక్షణ ఒక అందమైన సమానత్వము కలిగి ఉన్నదని పౌలు తన పాఠకులకు గుర్తుచేసాడు. ఇందులో యూదుడని గ్రీసుదేశస్థుడని లేదు, దాసుడని స్వతంత్రుడని లేదు, పురుషుడని స్త్రీ అని లేదు; యేసుక్రీస్తునందు మీరందరును ఏకముగా ఉన్నారు. ఒకని బాప్తిస్మము తరువాత, అతడు లేదా ఆమె "యూదునిగా" లేక "గ్రీకునిగా," "దాసునిగా" లేక "స్వతంత్రునిగా," లేదా "పురుషునిగా" లేక "స్త్రీనిగా" ఉండుట విడిచిపెట్టాలని పౌలు చెప్పలేదు. ఉదాహరణకు, ఒక వ్యక్తి తన వారసత్వమును మార్చుకొననక్కరలేదు. బదులుగా, క్రీస్తులో ఉన్నవారందరికీ సమాన హోదా ఉంది అని పౌలు చెప్పాడు.[60] "సిలువ యొద్ద నేల అంతయు సమానముగా ఉంది" అని చెప్పబడింది. అందరు ఒకే విధంగా క్రైస్తవులగుదురు, మరియు దేవునికి అందరూ విలువైన వారే. అందరూ క్రీస్తును ధరించుకొనియున్నారు మరియు ఆయనకు చెందినవారు. దేవుని రాజ్యములో రెండవ శ్రేణి పౌరులు లేరు.

పౌలు యొక్క మూడు విభాగాలు ముఖ్యమైనవి ఎందుకనగా అన్యులు, దాసులు, మరియు స్త్రీలు సహజంగా ఇశ్రాయేలీయులకు చెందిన భూమిని వారసత్వంగా పొందలేరు. అయితే, అందరూ కూడా "దేవుని కుమారులుగా" (3:26) మరియు "వారసులుగా" (3:29) చెప్పబడ్డారు. ఈ ముగ్గురు సమూహములలో ప్రతిఒక్కరు "ఒకే బాప్తిస్మము" పొంది "ఒకే శరీరములో" చేర్చబడిరి (ఎఫెసీ. 4:4, 5). నిజమైన వారసుడైన క్రీస్తుతో ఐక్యత కలిగి ఉండి ఆయనతో కూడా వారిని "తోటి వారసులనుగా" చేసికొనెను (రోమా. 8:17).

"క్రీస్తులో" ఉన్నవారి ఐక్యత, సంఘములో మరియు ఇంటిలో దేవుడు లింగ పాత్ర విలక్షణాలను స్థాపించాడన్న వాస్తవమును నిరాకరించదు.[61] ఈ సత్యము 1 పేతురు 3:1-7లో కనిపిస్తుంది, అక్కడ భార్య భర్తకు లోబడి ఉండాలని, మరియు భర్త భార్యను ఒక బలహీన భాగస్వామిగా పరిగణించాలని హెచ్చరించబడ్డారు. లింగ భేదాలు లేఖనములో స్పష్టంగా ఉన్నవి, అయినను భార్య "జీవితములోని కృపకు తోటి వారసురాలిగా" సూచించబడెను. వివిధ పాత్రలు ఉన్నను, దేవుని రాజ్యములో వారు సమాన స్థితిని పొందుకుంటారు. F. LaGard Smith ఈ నియమమును క్రీడల సారుప్యతతో పోల్చాడు: అందరూ ఒకే జట్టులో ఉన్నారు గానీ, "అందరూ ఒకే స్థానంలో ఆడరు."[62]

**వచనము 29.** పౌలు పత్రికలోని ఈ భాగమును ఒక గుర్తుతో ముగించాడు: **మీరు క్రీస్తు సంబంధులైతే ఆ పక్షమందు అబ్రాహాము యొక్క సంతానమైయుండి వాగ్దాన ప్రకారము వారాసులైయున్నారు** (3:7-9 చూడండి). క్రీస్తులో ఉన్నవారు (అబ్రాహాము "సంతానము"), గుర్తింపు ద్వారా "అబ్రాహాము సంతానము." క్రీస్తులో వారికున్న ప్రయోజనకరమైన స్థితి వారిని "వాగ్దాన ప్రకారముగా వారసులనుగా చేస్తుంది" - అనగా దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానము. అందుచేత, అన్య క్రైస్తవులు విశ్వాసము ద్వారా దేవుని వాగ్దానమును పొందుకున్నారు; వారు మోషే ధర్మశాస్త్రమును పాటించవలసిన అవసరం లేదు.

# అన్వయము

## విశ్వాసము యొక్క శ్రేష్టత్వం (అధ్యా. 3)

గలతీయులకు 3లో, ధర్మశాస్త్రము కంటే విశ్వాసము యొక్క ఉన్నతమైన స్థితిని పౌలు చూపించిన అనేక విధములను మనము చూడగలము.

*ఆత్మ రుజువు* (3:1-5). గలతీలో ఉన్నటువంటి క్రైస్తవులు యేసుక్రీస్తునందు విశ్వాసముంచుట ద్వారానే పరిశుద్ధాత్మను పొందుకున్నారే తప్ప, ధర్మశాస్త్రము యెడల విధేయత చూపించుటను బట్టి కాదు. వారు క్రీస్తులోకి బాప్తిస్మము పొందినప్పుడు ఆత్మీయ వరములను వారు పొందుకున్నారు (3:2, 26, 27; అపొ. 2:38; తీతు. 3:5 చూడండి), మరియు ఆత్మ యొక్క అద్భుతమైన వరములను వారు పొందుకున్నారు (అపొ. 8:12-17; 19:5, 6 చూడండి). యూదులు గలతీయకు రాకమునుపే అక్కడ క్రైస్తవుల ద్వారా దేవుని ఆత్మ అద్భుత కార్యములను జరిగించెనన్న సత్యము, ధర్మశాస్త్రమును పాటించకుండానే వారు దేవుని చేత అంగీకరించబడెనని స్పష్టం చేస్తుంది. యేసుక్రీస్తు యెడల వారికున్న విశ్వాసము ద్వారానే వారు అంగీకరించబడెను.

*అబ్రాహాము పద్ధతి* (3:6-9). యూదులకు పితరుడైన, అబ్రాహాము, విశ్వాస నియమమునకు ఒక మాదిరిగా (లేదా ఉదాహరణగా) ఉన్నాడు- అబ్రాహాము హారనులో ఉండగానే దేవుడు అతనితో మాట్లాడి అతనికి విలువైన వాగ్దానములను ఇచ్చెను. ఈ ప్రకటనలలో, అబ్రాహాము ద్వారా "భూమి యొక్క సమస్త వంశములు ఆశీర్వదించబడునని" (ఆది. 12:3) దేవుడు చెప్పెను. యేసు పూర్వికుల ప్రకారముగా, అబ్రాహాము సంతానము గనుక ఈ పదాలు క్రీస్తు సువార్తను ముందస్తుగానే గ్రహించాయి (గలతీ. 3:8). తదుపరి, అబ్రాహాము కనానులోకి ప్రవేశించిన పిమ్మట, అతనికి కుమారుడు జన్మిస్తాడని మరియు అతని సంతానము ఆకాశములో నక్షత్రములవలె విస్తారముగా ఉంటారని చెప్పాడు (ఆది. 15:4, 5). ప్రతిస్పందనగా, అబ్రాహాము "యెహోవాను నమ్మెను; ఆయన అది అతనికి నీతిగా ఎంచెను" (ఆది. 15:6). క్రీస్తుయందు విశ్వాసముతో జీవించువారు "విశ్వాసియైన అబ్రాహాము" అడుగుజాడల్లో నడుస్తారు మరియు ఆయనతో కూడా కలిపి దీవించబడతారు (గలతీ. 3:9).

*ధర్మశాస్త్రమును ఉల్లంఘించినవారి కారణంగా శిక్ష* (3:10-14, 19-22).

ధర్మశాస్త్రమును పాటించుట వలన తమ సొంత నీతిని స్థాపించుకోవాలని ప్రయత్నించిన వారు శాపగ్రస్తులు. ఇది వాస్తవం ఎందుకనగా చట్ట నియమము పరిపూర్ణతను కోరుతుంది: "ధర్మశాస్త్ర గ్రంథమందు వ్రాయబడిన విధులన్నియు చేయుటయందు నిలుకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు" అని వ్రాయబడియున్నది (3:10). అదియుగాక, దేవుని ఆజ్ఞలను ఎవ్వరు కూడా పరిపూర్ణంగా ఆచరించలేరు: "ఏ భేదమును లేదు; అందరును పాపముచేసి దేవుడు అనుగ్రహించు మహిమను పొందలేక పోవుచున్నారు" (రోమా. 3:23). అయితే, యేసు పాప రహితమైన జీవితం జీవించి, ఆయన సిలువలో మరణించినప్పుడు పాప శాపమును ఆయనపై మోసేను. "మనమాయనయందు దేవుని నీతి అగునట్లు పాపమెరుగని ఆయనను మనకోసము పాపముగాచేసెను" (2 కొరింథీ. 5:21). అందువలన, మనము పాపులమైనప్పటికీ, యేసుక్రీస్తు నందు మనకున్న విశ్వాసము ద్వారా నీతిమంతులముగా యెంచబడుదము.

*అబ్రాహాముతో చేయబడిన వాగ్దానముల యొక్క ప్రాధాన్యత* (3:15-18). ధర్మశాస్త్రము ఇచ్చుటకు (నిర్గ. 19-24) కొన్ని వందల సంవత్సరముల క్రితమే దేవుడు అబ్రాహాముకు వాగ్దానములను ఇచ్చెను (ఆది. 12-22). అబ్రాహాముతో ప్రమాణము చేయుటద్వారా దేవుడు తన *నిబంధనను* ధృవీకరించెను (ఆది. 22:15-18). ఆయన అబ్రాహాముతో ప్రత్యక్షంగా మాట్లాడెను, అయితే ధర్మశాస్త్రమనేది ఇశ్రాయేలీయులకు దూతల ద్వారా లేదా మధ్యవర్తి ద్వారా (మోషే) ఇవ్వబడెను. ఈ కారణములచేత, ధర్మశాస్త్రము కంటెను దేవుని వాగ్దానములు ముందుగా ఉన్నవి. దేవుడు అబ్రాహాముతో చేసిన నిబంధనను ధర్మశాస్త్రము ఏ విధము చేతనైనను మార్చలేదు. ప్రత్యేకముగా, దేవుడు "సంతాన" వాగ్దానము చేసెను, అది మనకు క్రీస్తు రాకడను ముందుగానే గ్రహించు గలతీ 3:16 ద్వారా తెలియపరచబడుతుంది. "భూలోకములోని జనములన్నియు నీ సంతానమువలన ఆశీర్వదించబడును" అని దేవుడు చెప్పెను (ఆది. 22:18).

*ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశము* (3:23-29). ధర్మశాస్త్రము ఒకని నీతిని స్థాపించుటకు ఇవ్వబడలేదు కానీ, క్రీస్తు వచ్చువరకు బాలశిక్షకునిగా ఉండుటకు ఇవ్వబడెను. పోల్చుటకు ఇక్కడ పౌలు ఉపయోగించిన ఊహాచిత్రం ఏమనగా గ్రీకు-రోమా ప్రపంచంలో ఒక బాలుడు వయస్సులో ఎదుగుతుండగా అతనికి బాధ్యత వహించవలసిన దాసుడితో పోల్చబడింది (3:24). ఆ బాలుడు, పెద్దవాడైనప్పుడు, సంరక్షకుడు తన బాధ్యతల నుండి విడుదల పొందుతాడు. అదేవిధంగా, ధర్మశాస్త్రము కూడా తాత్కాలికముగా ఉండుటకే తయారు చేయబడెను. ఇది (ధర్మశాస్త్రము) దేవునిని మరియు నీతిని గూర్చి యూదులకు అనేకమైన ప్రాథమిక నియమాలను బోధించెను, పాపమును మరియు తిరుగుబాటును గూర్చి వారిని హెచ్చరించెను. అయితే, క్రీస్తు ఆయన యొక్క పనిని (పరిపక్వత యుగం ప్రారంభమైనప్పుడు) ముగించినప్పుడు, ధర్మశాస్త్రము యొక్క అవసరము ఇక ఎన్నటికీ లేదు (సంరక్షకుడు విడిపించబడెను). దాని ఉద్దేశం నెరవేర్చబడెను.

## సిలువవేయబడిన క్రీస్తు (3:1)

గలతీయ పట్టణములో ప్రకటించుచుండగా, సిలువవేయబడిన యేసునును గూర్చి స్పష్టంగా వివరించెను (3:1). కొరింథులో ఆయన పనిని గూర్చి, అపొస్తలుడు ఇలా వ్రాసెను, "నేను, యేసుక్రీస్తును అనగా, సిలువవేయబడిన యేసుక్రీస్తును తప్ప, మరిదేనిని మీ మధ్య నెరుగకుందునని నిశ్చయించుకొంటిని" (1 కొరింథీ 2:2). కేవలము యేసు మరణమును గూర్చిన అంశముపైనే మాట్లాడెను అని పౌలు చెప్పలేదు గానీ ఆయన సందేశములో అది కేంద్ర బిందువు అని చెప్పెను. తదుపరి, అదే పత్రికలో, ఆయన ఇలా వ్రాసాడు, "నాకియ్యబడిన ఉపదేశమును మొదట నీకు అప్పగించితిని. అదేమనగా, లేఖనముల ప్రకారము క్రీస్తు మన పాపముల నిమిత్తము మృతిబొందెను, సమాధి చేయబడెను, లేఖనముల ప్రకారము మూడవ దినమున లేపబడెను" (1 కొరింథీ. 15:3, 4).

యేసు బలి నేడు మన సందేశములో కేంద్ర బిందువుగా (గుండెకాయి వలె) ఉండాలి. క్రీస్తు బాధను, వేదనను మరియు సిలువ అర్థమును ప్రకటించుట ద్వారా దేవుని అద్భుత కృపను ఇతరులు అభినందించునట్లు మనము ఇతరులకు సహాయపడగలము. యేసు మరణమును సమీపంగా చూచుట వలన పాపము యొక్క ప్రమాదకరమైన స్వభావమును గుర్తించునట్లు ప్రజలకు సహాయపడగలము. పాపము కొరకు బలియైన ఒకే రక్షకుడైన యేసునందు లోతైన నమ్మకమును కూడా ఇది కలిగిస్తుంది.

ప్రతి వారము కూడా యేసు మరణమును జ్ఞాపకము చేసికొనునట్లు సంఘము యెదుట దేవుడు ఒక స్మారక చిహ్నమును ఉంచెను. ప్రభువు దినమున, ప్రభు భోజనమును మనము జరుపుకుంటాము (అపొ. 20:7). క్రీస్తు శ్రమలను జ్ఞప్తికి తెచ్చు ఈ స్థిరమైన స్మారక చిహ్నము మన స్వనీతిని మరియు మన మంచి పనులలో నమ్మకముంచుకొనకుండా మనలను తప్పించును గాక. తదుపరి, సిలువవేయబడి, పునరుత్థానుడైన ప్రభువునందు మన విశ్వాసమును బలపరచును గాక. మనము వాటిలో పాలుపంచుకొనినప్పుడు, మనము ఆయన శరీరమును మరియు రక్తమును మాత్రమే జ్ఞాపకము చేసికొనుట మాత్రమే కాక "ఆయన వచ్చువరకు ఆయన మరణమును ప్రచురించుదురు గాక" (1 కొరింథీ 11:26).

## నిబంధనల మధ్య వ్యత్యాసం (3:3)

గలతీయులకు 3:3లో, "మీరు అవివేకులైతిరా? మొదట ఆత్మానుసారముగా ఆరంభించి, యిప్పుడు శరీరానుసారముగా పరిపూర్ణులగుదురా?" అని పౌలు అడిగాడు. రెండు నిబంధనలను గూర్చిన పరిశీలనల నుండి, వాటి మధ్య ఉన్నటువంటి వ్యత్యాసము, వాటి *విషయములో* మాత్రమే కాదుగానీ *స్వభావములో* కూడా ఉంది అని స్పష్టం అవుతుంది. క్రమంగా, శతాబ్దాలుగా, ప్రపంచంలో, శరీర విషయాలు క్రైస్తవ జీవితాల్లో మరియు ఆరాధనలలో ప్రవేశపెట్టబడ్డాయి. ఇవి ఆత్మానుసారమైనవి కావు. Martin Luther మరియు ఇతర సంస్కర్తలు విశ్వాసము యొక్క క్రైస్తవ వ్యవస్థలో

చోటులేని వాటిని శుభ్రపరచుట మొదలుపెట్టారు, కానీ మరలా మరలా వారి అనుచరులు పాత నిబంధన ఆచారాలను తిరిగి మొదలుపెట్టారు. నేడు చాలామంది నిబంధనల మధ్య ఉన్నటువంటి వ్యత్యాసమును కనుగొనలేకుండా ఉన్నారు. కొంతమంది చెప్పినట్లుగా కేవలము మేము వెలుపటి వారితో వ్యవహరించుట లేదుగానీ క్రీస్తు సువార్త *సారాంశమును* గూర్చి చెప్తున్నాము. *క్రొత్త నిబంధన సిద్ధాంతం వైపు చట్టపరమైన వైఖరులను గూర్చి పౌలు మాట్లాడుతున్నాడు అని చెప్పున్నట్లు గలతీ పత్రిక చట్టబద్ధతపై పరిశోధన కాదు.* క్రొత్త నిబంధన గ్రంథములో "చట్టబద్ధత" అను పదము ఈ విధంగా ఉపయోగించబడలేదు. గలతీ 1:6-8లో అపొస్తలుడు చాలా వ్యతిరేకముగా వ్యతిరేకించిన సువార్త వక్రీకరణ అనేది మోషే ధర్మశాస్త్రమును క్రైస్తవులపై కట్టుదిట్టం చేస్తుంది. కృప ద్వారానే రక్షణ అను అంశమును చర్చించుటలో పౌలు కంటే ఎక్కువగా ఎవ్వరు దృష్టి పెట్టలేదు కానీ, క్రీస్తు శిష్యులుగా ఉండు ప్రతిఒక్కరి నుండి దేవుడు విధేయతను కోరుచున్నాడు అని చెప్పుటకు కృపను ఆయన ఎన్నడు కృపను కారణంగా ఉపయోగించలేదు.

## ధర్మశాస్త్రము నుండి విమోచన (3:10-14)

గలతీయులకు 3:10-14లో, ధర్మశాస్త్రము యెడల విధేయత ద్వారా నీతిమంతులుగా తీర్చబడుటకు ప్రయత్నించు ప్రతివారు శాపగ్రస్తులు అని పౌలు వివరించాడు. ఇది వాస్తవము ఎందుకనగా ధర్మశాస్త్రము పరిపూర్ణ విధేయతను కోరుతుంది. అయితే, క్రీస్తు మనకొరకు సిలువలో శ్రమపొంది మరణించినప్పుడు పాపము లేని ఆయన ధర్మశాస్త్రము యొక్క శాపమును మోసేను. అందుచేత, యేసునందు విశ్వాసము ద్వారా రక్షణ దీవెనలను మరియు ఆత్మను మనం పొందుకొనవచ్చు. రోమీయులకు వ్రాసిన పత్రికలో పౌలు ఇలాటి ఆలోచనలనే వివరించెను:

> శరీరము ననుసరింపక ఆత్మ ననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతివిధి [δικαίωμα, *dikaiōma*] నేరవేర్చబడవలెనని పాప పరిహారము నిమిత్తము దేవుడు తన సొంత కుమారుని పాప శరీరాకారముతో పంపి, ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను (రోమా. 8:3, 4).

వేరే మార్గము ఏమియు లేదు! ఈ ధర్మశాస్త్ర సంబంధమైన "నీతివిధి" మార్పులేనిది - మానవునికి మార్పులేనిదిగానే దేవునికి కూడా మార్పులేనిది - ఎందుకనగా ధర్మశాస్త్రము విధేయతను కోరుతుంది. ధర్మశాస్త్రము కఠినమైన అర్థములో, కృపను గూర్చి గాని లేదా దయను గూర్చి గానీ ఏమియు చేయలేదు కానీ న్యాయ విధి గూర్చి మాత్రమే చేయగలదు. అంతేగాక, ఈ ధర్మశాస్త్రము న్యాయమైనది మరియు నీతిగలది. ధర్మశాస్త్రము యొక్క నీతి ఒక అద్భుతమైన ప్రకాశం.

చాలా సంవత్సరాల క్రితం నేను స్విట్జర్లాండ్ లోని Zurichలో ఉన్నప్పుడు, Swiss సహపనివాడితో కలసి నేను ఒక కార్యక్రమమునకు వెళ్తున్నాను. మునుపు నేను

చాలామార్లు వెళ్లిన వీధిలోకి ప్రవేశించినప్పుడు, నా వెనుక పోలీసు కారు యొక్క మెరుస్తున్న కాంతిని వెనక్కి వంగి చూచితిని. నేను ఏమి తప్పు చేసానన్న విషయమును గ్రహించక వెంటనే రోడ్డు ప్రక్కకు నడిపి, ఆపాను. (ఏమి తప్పు చేసానోనాన్న విషయమును) కనుగొనుటకు నేను త్వరపడ్డాను. ఈ వీధి ప్రవేశ ద్వారము యొద్ద "ప్రవేశింపకుడి" అను సూచనను నేను పట్టించుకోలేదు. ఇది నగరములో చివరి రోజున జరిగింది, తరువాత రోజున నేను అమెరికా వెళ్లుటకు విమానం యెక్కవలసి ఉండెను. తదుపరి, నగరములో ఉన్న అన్ని ఆఫీసులు మూసివేయుటకు గంట ముందు ఇది జరిగింది. ఆఫీసరుని బ్రతిమాలుకొనుచు, నేను ఇలా చెప్పితిని, "చూడండి, అఫీసరు గారు, నేను కొన్ని సంవత్సరాలు Zurichలో ఉన్నాను మరియు నేను నియమాలను ఉల్లంఘించు చీటీని నేను పొందలేదు." నవ్వుతు, తన కలమును చిన్న పలకపై ఉంచుతూ ఆఫీసరు ఇలా సమాధానమిచ్చెను, "నీవు ఏమి కోరుతున్నావు? నీవు పతకమును పొందుకోవాలనుకొంటున్నావా?" నిజానికి, నాకు కావలసినది న్యాయము కాదు, దయ. ఇటీవల పెట్టిన సూచనను నేను చూడలేదు, కాబట్టి నా ఉల్లంఘున అనుకోకుండా జరిగినది. అయితే, ఈ వ్యక్తి న్యాయమూర్తి కాదు; ఆయన నియమాల ఆఫీసరు మాత్రమే. ఆ టిక్కెట్టు పట్టుకొని సరియైన ఆఫీసరు వద్దకు నేను వెళ్లాను మరియు దేవుని కృపవలన సమయం కాకమునుపే ఋణాన్ని పరిష్కరించుకోగలిగాను. చట్టము యొక్క స్వభావమును గూర్చిన ప్రాముఖ్యతను నేను నేర్చుకొన్నాను. చట్టముపట్ల విధేయత చూపవలసిన అవసరం ఉంది; విధేయత చూపని యెడల, దాని పర్యావసానాలు ఉన్నాయి.

ఈ వృత్తాంతం కేవలము అల్పమైనదే, కానీ దేవుని ధర్మశాస్త్రము మాత్రం ఎవ్వరికీ హాస్యాస్పదం కాదు. పౌలు క్లుప్తముగా చెప్పినట్లుగా, "పాపము వలన వచ్చు జీతము మరణము. . . ." ఈ నియమము వచనము ముగించబడు మాటలకంటే అనగా: "అయితే దేవుని కృపావరము మన ప్రభువైన క్రీస్తుయేసునందు నిత్యజీవము" కంటే సహాయము లేదా పరిష్కారము ఏదీయు కూడా ఇవ్వదు (రోమా. 6:23). ధర్మశాస్త్రము, పరిష్కారము ఇవ్వదు. ధర్మశాస్త్రము న్యాయమును కోరుతుంది; న్యాయము జరిగించినట్లైతే, సమస్త మానవాళి నాశనమయ్యేది. దేవుని కృపవలన ఇది తప్పించబడింది. పౌలు చెప్పాడు,

> ఇట్లుండగా ధర్మశాస్త్రమునకు వేరుగా దేవుని నీతి బయలుపడుచున్నది; . . . అది యేసుక్రీస్తునందలి విశ్వాసమూలమైనదై, నమ్ము వారందరికి కలుగు దేవుని నీతియై యున్నది . . . కాబట్టి నమ్మువారు ఆయన కృపచేతనే, క్రీస్తుయేసునందలి విమోచనము ద్వారా ఉచితముగా నీతిమంతులని తీర్చబడుచున్నారు (రోమా. 3:21-24).

మన దేవుని నీతి అన్యాయస్థులైన మనలను నీతిమంతులుగా చేసి మరియు ఆయన తానే నీతిమంతునిగా ఉండుట ఎలా సాధ్యం? సృష్టికి మునుపు దేవుడు ఏర్పాటు చేసిన విముక్తి పనిలో దీనికి సమాధానం కనిపిస్తుంది. "విమోచన" అనేది తీసుకున్నటువంటి రుణమును తీర్చుటను సూచిస్తుంది; మరియు క్రీస్తు అర్పణలో

దేవుడు ఈ ఋణమును కొట్టివేసెను. ఈ విధముగా, "తాను నీతిమంతుడును యేసునందు విశ్వాసముగలవానిని నీతిమంతునిగా తీర్చువాడునై యుండుటకు ఆయన ఆలాగు చేసెను" (రోమా. 3:26). ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశమును ఆయన నెరవేర్చెను (*dikaiōma*); కాబట్టి, సార్వభౌమ కృపలో, తన సొంత న్యాయ చట్టంపై ఏ విధమైన ఉల్లంఘన లేకుండా శాశ్వతమైన విమోచనయైన అద్భుత బహుమతిని పాపులందరికీ క్రీస్తులో అనుగ్రహించెను.

దేవుడు తన కార్యములన్నిటిలో సార్వభౌముడు. ఆయన ప్రేమగలవాడని, దయగలవాడని అందరూ గ్రహిస్తారు, కానీ ఆయన నీతిమంతుడు మరియు న్యాయము తీర్చువాడు. ఆయన దైవ స్వభావములో ఏదియు కూడా దేనిని ఉల్లంఘించదు; అవన్నియు పరిపూర్ణ సమాధానముతో ఉంటాయి. దేవుడు, ఆయన యొక్క అనంత జ్ఞానములో, మానవుని పాప సమస్యకు పరిష్కారమునకు సాధ్యమయ్యే మార్గమును ఉద్భవించుచు ఏకకాలంలోనే తన ప్రేమను మరియు పరిపూర్ణమైన న్యాయమును కనుపరచెను.

ఈ విధంగా, ధర్మశాస్త్రము నెరవేర్చబడెను కానీ, మానవుని పాప సమస్య పరిష్కరించబడెనా? మనం క్రైస్తవులముగా మారినప్పుడు పాపమును చేయడం మనివేసామా? యోహాను దీనిని గూర్చి స్పష్టముగా చెప్పెను: "మనము పాపములేనివారమని చెప్పుకొనినయెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము; మరియు మనలో సత్యముండదు" (1 యోహాను 1:8). దేవునితో మనకున్న సంబంధము పాపమును ముందే ఊహిస్తుంది. యోహాను చెప్పెను, "మన పాపములను మనము ఒప్పుకొనినయెడల, ఆయన నమ్మదగినవాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతినుండి మనలను పవిత్రులనుగా చేయును (1 యోహాను 1:9). అదనముగా, ఆయన ఇలా చెప్పెను, "మనము పాపము చేయలేదని చెప్పుకొనినయెడల, ఆయనను అబద్ధికునిగా చేయువారమగుదము; మరియు ఆయన వాక్యము మనలో ఉండదు" (1 యోహాను 1:10). పాపులముగా దేవునితో మనము సంబంధమును మొదలుపెట్టుట మాత్రమే కాదుగానీ, ప్రభువు రక్తముచే కడుగబడిన పిమ్మట కూడా మనము పాపులుగానే ఉన్నాము. అందుచేత, మనము ఎల్లప్పుడు క్షమాపణనొందుతు ఉండాలి మరియు దేవుని కృప వలన క్షమాపణ కొరకు ఎదురు చూడాలి.

దేవుడు ఆరంభించిన పరిష్కారము ఏదనగా సిలువ యొక్క విమోచన చర్య. ఇది ధర్మశాస్త్రము యొక్క ఉద్దేశమును నెరవేర్చి మరియు దేవుని కృపను విశ్వాసులపై కురిపించెను. ఇదంతయు దేవుని పని మాత్రమే. మానవుడు నీతిమంతునిగా లేదా న్యాయవంతునిగా పరిగణించబడుటకు దీనిలో మానవుని పాత్ర ఏమిటి?

సులభమైన సమాధానమేమనగా మనమున్నటువంటి పరిస్థితిని విడచి రక్షకుని యొక్క విడువని ప్రేమను నమ్మాలి. పాత పాటయైన "Rock of Ages" పదాలలో మనము జ్ఞాపకం ఉంచుకొనవలసిన సత్యమును మనము కనుగొంటాము:

నా చేతుల కష్టము
ధర్మశాస్త్ర నియమాలను నెరవేర్చలేదు;
నా ఆశకు ఉపశమన లేదు,
నా కన్నీళ్లు ఎప్పటికీ ప్రవహిస్తాయి,
అన్నియు పాపమునకు ప్రాయశ్చిత్తం కాలేవు,
నీవే రక్షించాలి మరియు నీవు మాత్రమే.
నా చేతిలో నేనేమియు తీసుకురాలేదు:
నీ సిలువను అంటిపెట్టుకొనియున్నాను;
దిగంబరినిగా, కప్పబడుటకు నీ యొద్దకు వచ్చితిని;
నిస్సహాయంగా, నీ యొద్దకు కృప కొరకు వచ్చాను;
అయ్యో, నేను నీటి ఊట యొద్దకు పరిగెడుచున్నాను:
నన్ను కడుగు, రక్షకుడా, లేదా నేను మరణిస్తాను.[63]

మనము దానిని ఒప్పుకొనుటకు ఎంత ద్వేషిస్తామో, మనము చేసిన పాపములను ఎంతగా ద్వేషిస్తామో, దేవునితో మనకున్న సంబంధం యొక్క ప్రాథమిక వాస్తవం ఏమనగా ఆయన పరిశుద్ధత మరియు మన పాపము. కేవలము ఆయన కృప ద్వారానే ఆయనతో మనము సరైన సంబంధము కలిగి ఉంటాము (3:26-29). సిలువచెంత మోకాళ్లు వంచడానికి ఈ వాస్తవము ప్రతిదినము మనలను కదలించాలి.

"ధర్మశాస్త్రము" అను పదమును ఉపయోగించిన లేదా లేకపోయినను ధర్మశాస్త్రమునకు అవసరమైన నీతిని పొందడం మనకు అసాధ్యం. మనకు మనం సొంతంగా పొందుకొనలేనిది, పాపపరిహారార్థబలిగా దేవుడు ఆయన కుమారునిని ఇచ్చినప్పుడు అది మనకు ఇచ్చాడు. "శరీరము ననుసరింపక ఆత్మననుసరించియే నడుచుకొను మనయందు ధర్మశాస్త్ర సంబంధమైన నీతివిధి నెరవేర్చబడవలెనని పాపపరిహారమునిమిత్తము ఆయన శరీరమందు పాపమునకు శిక్ష విధించెను" (రోమా. 8:3, 4). అందుచేత, విమోచించబడినవాడు ఆత్మననుసరించి నడచుకొనాలి.

## విశ్వాసము ద్వారా నీతిమంతులుగా చేయబడుట (3:11)

అబ్రాహాముకు ఆపాదించబడిన నీతి విశ్వాసము ద్వారా కలిగినది (ఆది. 15:5, 6). దేవునికి మరొక మార్గము లేదు! పాత నిబంధన కాలములో మరియు దానికి మునుపు ఉన్నటువంటి నీతిమంతులందరు విశ్వాసము ద్వారా జీవించిన స్త్రీ పురుషులే (హెబ్రీ. 11). దైవ వాగ్దానములను నమ్ముట అనేది దేవునితో మానవునికున్న సరియైన సంబంధముకు మూలముగా ఉంది, హేబెలు మరియు నోవాహు కాలములో కూడా ఇంతే (హెబ్రీ. 11:4, 7, 39, 40). గలతీయులకు 3లో, పౌలు అబ్రాహాము ఉదాహరణపై మరియు రానున్న విమోచకుని గూర్చి ఆయనకిచ్చిన వాగ్దానముపై దృష్టి పెట్టాడు. నిజానికి, ఈ విమోచకుడు, వాగ్దాన "పుత్రుడు" క్రీస్తే (3:16). దేవుడు మానవులకు అంగీకరించుటకు అనేకమైన వాక్యభాగములలో చెప్పబడిన ప్రాథమిక అవసరతలు హబక్కూకు 2:4లో కంటే ఎక్కడను వివరముగా చెప్పబడలేదు, అది మరల

గలతీయులకు 3:11లో చెప్పబడింది: "నీతిమంతుడు విశ్వాస మూలముగా జీవించును" (రోమా. 1:17; హెబ్రీ. 10:38 చూడండి).

## వాగ్దాన దేవుడు (3:15-18)

దేవుడు వాగ్దానము చేయు దేవుడు. పాత నిబంధన గ్రంథములో, ఆయన నోవాహు, అబ్రాహాము, మోషే మరియు దావీదులాటి వారితో నిబంధనలు చేసెనని మనము చదువుతాము. ఆయన వాగ్దానముల యెడల ఆయన ఎల్లప్పుడు నమ్మకంగా ఉన్నాడు, మరియు నూతన నిబంధనలో చేసిన వారితో కూడా నమ్మకంగా ఉంటాడు. క్రొత్త నిబంధనలో అనేకమైన వాక్యభాగములు దేవుని యొక్క యథార్థతను గూర్చి మాట్లాడుతున్నాయి. ఉదాహరణకు, హెబ్రీ రచయిత ఈ విధంగా సాక్ష్యమిస్తున్నాడు "దేవునికి అబద్ధమాడుట అసాధ్యము" (హెబ్రీ. 6:18). అదేవిధంగా, ". . . అబద్ధమాడనేరని దేవుడు" అని పౌలు చెప్పాడు (తీతు. 1:2). మరోచోట, "మిమ్మును పిలుచువాడు నమ్మకమైనవాడు గనుక ఆలాగు చేయును" అని ఆయన చెప్పెను (1 థెస్స. 5:24).

నేడు మనము దేవుని వాగ్దానములను నమ్మగలము, మరియు మన వాగ్దానములను నెరవేర్చుట ద్వారా ఆయన సారూప్యమును మనము ప్రతిబింబించగలము. కీర్తనాకారుడు ఇలా అడిగాడు, "యెహోవా నీ గుడారములో అతిథిగా ఉండదగినవాడెవడు? నీ పరిశుద్ధ పర్వతముమీద నివసింపదగిన వాడెవడు?" ఈ ప్రశ్నలకు ఒక సమాధానమేమనగా "అతడు ప్రమాణము చేయగా నష్టము కలిగినను మాట తప్పడు" (కీర్తనలు 15:1, 4).

## ధర్మశాస్త్రము మరియు అబ్రాహాముకు దేవుని వాగ్దానము (3:15-29)

3:15-29లోగల క్లిష్టమైన ఆలోచనల్లో, ధర్మశాస్త్రమునకు మరియు అబ్రాహాముతో దేవుడు చేసిన వాగ్దానముకు మధ్యనున్న సంబంధమును పౌలు వివరించెను. ఈ వాక్యభాగము నుండి తీసుకొనవలసిన కొన్ని ముఖ్యమైన ఆలోచనలను మనము పరిశీలించుదము.[64]

*ధర్మశాస్త్రము వాగ్దానమును మార్చలేదు* (3:15-18). మునుపు దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానమును మోషే ధర్మశాస్త్రము మార్చలేదు. వాగ్దానము యొక్క ప్రాధాన్యత మరియు ప్రమాణము ద్వారా దేవుడు దానిని ధృవీకరించిన విధము దానిని మార్చలేకపోయెను. అబ్రాహాము "సంతానమైన" యేసుక్రీస్తు ద్వారా జనములను ఆశీర్వదించాలనుకొన్నదే దేవుని వాగ్దానము.

*ధర్మశాస్త్రము వాగ్దానము కంటే శ్రేష్టమైనది కాదు* (3:19, 20). ఇది రెండు కారణముల వలన నిజము. (1) ధర్మశాస్త్రము తాత్కాలికము (3:19). క్రీస్తు నూతన నిబంధనను స్థాపించినప్పుడు, ధర్మశాస్త్రము యొక్క అవసరత ఇక లేదు. (2) ధర్మశాస్త్రము మధ్యవర్తి ద్వారా వచ్చింది (3:19, 20). దేవుడు అబ్రాహాముకు ప్రత్యక్షంగా ఇచ్చిన వాగ్దానమునకు విరుద్ధంగా, ధర్మశాస్త్రము ఇశ్రాయేలీయులకు

దూతల ద్వారా మరియు మధ్యవర్తి (మోషే) ద్వారా ఇవ్వబడెను. ఈ కారణముచే, దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానమున కంటే ధర్మశాస్త్రము తక్కువైనది.

*ధర్మశాస్త్రము వాగ్దానమునకు వ్యతిరేకముగా లేదు* (3:21-25). దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానములకు మోషే ధర్మశాస్త్రము వ్యతిరేకముగా లేదు. దాని ఉద్దేశము జీవితమును ఇవ్వడం కాదుగానీ, "పాపమును వెల్లడిచేయడం" లేదా "పాపమును నిరోధించడం." ఇది క్రీస్తు రాకడ మార్గమును సిద్ధపరచుట ద్వారా దాని యొక్క ఉద్దేశమును నెరవేర్చింది.

*వాగ్దానము చేయగలిగిన దానిని ధర్మశాస్త్రము చేయలేదు* (3:26-29). అబ్రాహాము యెడల దేవుని వాగ్దానము ఏమనగా క్రీస్తు ద్వారా జనములను ఆశీర్వదించుట. ఈ వాగ్దానము నెరవేర్చుటలో, యేసు వచ్చి ఆయన మరణము, సమాధి మరియు పునరుత్థానము ద్వారా ఆయన పనిని ముగించెను. విశ్వాసము, మారుమానస్సు మరియు బాప్తిస్మము ద్వారా ఈ శుభవార్తను ఎవరైతే హత్తుకొందురో దేవుని ఆశీర్వాదములలో వారు పాలుపంచుకొంటారు.

ధర్మశాస్త్రములో నిష్టగా ఉండు నేపథ్యము నుండి వచ్చుట ద్వారా, పౌలు దాని ప్రాముఖ్యతను నిరాకరించుట కష్టమే. ధర్మశాస్త్రము ప్రాముఖ్యమైన విధిని కలిగియున్నదని ఆయన ఒప్పుకొన్నాడు. అయితే, దాని ఉద్దేశం నెరవేరిందని మరియు ఆ ధర్మశాస్త్రము క్రైస్తవులను బంధించుట లేదని ఆయన చెప్పాడు.

## క్రైస్తవులకు ఏమి ఇవ్వబడెను (3:26-29)

యేసు సువార్తను విశ్వాసము మరియు బాప్తిస్మము ద్వారా అంగీకరించిన వారు అమితంగా దీవించబడతారు.

*మనము "దేవుని కుమారులము"* (3:26). మనము "దత్తపుత్రాత్మను పొందితిమి, ఆ ఆత్మ కలిగినవారమై మనము అబ్బా తండ్రీ అని మొర్రపెట్టుచున్నాము" (రోమా. 8:15). క్రీస్తు ద్వారా, దేవునితో మనకున్న సంబంధము పునరుద్ధరించబడెను. తండ్రి మనలను ఆయన పిల్లలుగా అంగీకరించెను, మరియు ప్రార్థనలో క్రీస్తు ద్వారా ఆయనతో మాట్లాడగలిగే అవకాశం మనకు ఉంది.

*మనము క్రీస్తును . . . ధరించుకొనియున్నాము* (3:27). పాప దోషమును ధరించుకొనక, క్రీస్తు వస్త్రములను మనము ధరించుకొన్నాము. అయన పరిపూర్ణత మరియు ఆయన బలి వలన, మన పరలోక తండ్రి యెదుట ఆయన మనలను నీతిమంతులుగా చేసెను. మనము ఆయన స్వభావమును తీసుకొంటూ దినదినము ఆయన సారూప్యములో మారుతున్నాము.

*మనము క్రీస్తు శరీరములో ఉన్నాము* (3:28). ఈ భిన్నమైన శరీరములో యూదులు మరియు అన్యులు, ధనికులు మరియు దరిద్రులు, స్త్రీలు మరియు పురుషులు ఉన్నారు. "క్రీస్తుయేసులో ఒకటిగా" ఉన్నవారు ఆయన సంఘమైన క్రీస్తు శరీరముగా చేయబడ్డారు.

*మనము "వాగ్దానము ప్రకారముగా వారసులము"* (3:29). క్రీస్తులో ఉండుట

ద్వారా మనము "అబ్రాహాము సంతానమైతిమి." చాలాకాలం క్రితం దేవుడు అబ్రాహాముతో చేసిన వాగ్దానములో మనము కూడా "వారసులము." మన చివరి వారసత్వం ఈలోక సంబంధమైనది కాదు. బదులుగా "అక్షయమైనదియు, నిర్మలమైనదియు, వాడబారనిదియునైన స్వాస్థ్యము పరలోకమందు భద్రపరచబడియున్నది" (1 పేతురు 1:4).

---

సూచనలు

[1]Robert L. Johnson, *The Letter of Paul to the Galatians*, The Living Word Commentary (Austin, Tex.: R. B. Sweet Co., 1969), 74. [2]Walter Bauer, *A Greek-English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3rd ed., rev. and ed. Frederick William Danker (Chicago: University of Chicago Press, 2000), 1101. [3]పునరుత్థానము తరువాత ఎమ్మాయి మార్గములో యేసుతో నడచిన ఇద్దరు శిష్యులను గూర్చి చెప్పుటకు ఉపయోగించబడెను; వీరు ఆత్మీయ జ్ఞానము లేనివారిగా ఉన్నారు (లూకా 24:25). [4]Bauer, 171. [5]Ben Witherington III, *Grace in Galatia: A Commentary on St Paul's Letter tothe Galatians* (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1998), 202. [6]Kenneth L. Boles, *Galatians & Ephesians*, The College Press NIV Commentary (Joplin, Mo.: College Press Publishing Co., 1993), 71–72. [7]Richard N. Longenecker, *Galatians*, Word Biblical Commentary, vol. 41 (Nashville: Thomas Nelson Publishers, 1990), 100. [8]అద్భుతమైన ఆత్మీయ వరాలు కొన్నిసార్లు బాప్తిస్మములో ఇవ్వబడినవి (అపొ. 19:5, 6), ఆత్మ ఇవ్వబడినప్పుడు కూడా ఇవ్వబడెను. కొన్నిసార్లు, ఆ అద్భుతమైన వరాలు బాప్తిస్మము తరువాత ఇవ్వబడ్డాయి (అపొ. 8:14-17). ఈ రెండు సంఘటనలలో అపొస్తలులు చేతులు ఉంచుట ద్వారా నూతన క్రైస్తవులు ఆత్మను పొందుకున్నారు. కొర్నేలి విషయంలో, ఆత్మ కుమ్మరింపు అనేది అన్యులు కూడా సువార్తను పొందుటకు అర్హులు అని యూదా క్రైస్తవులకు తెలియజేయుటకు ఒక సూచనగా ఉంది (అపొ. 10:44-48). [9]పాత నిబంధన కాలంలో కూడా పరిశుద్ధాత్మ ఉన్నప్పటికీ, ఇశ్రాయేలీయుల నాయకులకు (అనగా మోషే, సంసోను, మరియు ఏలీయ) అద్భుతకార్యము తక్కువగా ఉన్నాయి. "మనుష్యులందరిమీద" ఆత్మను కుమ్మరించు కాలమును గూర్చి యోవేలు ప్రవచించెను (యోవే. 2:28, 29; అపొ. 2:17, 18 చూడండి). [10]Bauer, 914–16.

[11]గలతీ. 4:11; 1 కొరింథీ. 15:2; 2 Cor. 6:1చూడండి. [12]2 కొరింథీ. 9:10; ఎఫెసీ. 4:16; ఫిలిప్పీ. 1:19; కొలస్సీ. 2:19; 1 పేతురు 4:11; 2 పేతురు 1:5, 11చూడండి. [13]Bauer, 1087. [14]"క్రొత్త" అను పదమునకు గ్రీకు క్రొత్త నిబంధన గ్రంథములో రెండు పదాలు ఉపయోగించబడెను: νέος (*neos*, "క్రొత్త కాలము "ఇటీవల") మరియు καινός (*kainos*, "నాణ్యతలో క్రొత్తది" లేదా "ఉపయోగంలో క్రొత్తది"). తరువాత పదము మార్కు 16:17లో ఉపయోగించబడెను. గలలియ అపొస్తలుల పెంతెకొస్తు దినమున ఉపయోగించబడిన "భాషలు" అను పదము జాతి భాషలుగా ఉన్నట్లు స్పష్టమౌతుంది, అది కాలక్రమానుసారము కాదు గానీ వారి ద్వారా క్రొత్తగా ఉపయోగించబడింది. పెంతెకొస్తు దినమున వివిధ భాషలు కలిగిన ప్రజలు యెరూషలేములో కూడినప్పుడు ఇది వారిని ఆశ్చర్యానికి గురి చేసింది (అపొ. 2:7, 8). [15]ఈ "భాషలు" నేర్చుకొనబడని, జాతి భాషలు (అపొ. 2:5-11; 10:44-47; 11:15 చూడండి). [16]"మనుష్యులందరూ" అని చెప్పబడిన పదమును బట్టి చూస్తే, అన్యులపై రెండవ కుమ్మరింపు అనేది అవసరం, ఎందుకనగా పెంతెకొస్తు దినమందు కేవలము యూదులు మాత్రమే అక్కడ

ఉన్నారు. ఈ రెండవ కుమ్మరింపుకు గల ఒక ఉద్దేశం ఏమనగా అన్యులు కూడా దేవునికి ఇష్టులే అని యూదులను ఒప్పింపచేయుటకు (అపొ. 11:1-18). [17]యోహాను 2:18-21; 3:2; 7:31; 9:16; 12:37; 20:30, 31; 1 కొరింథీ. 14:21, 22; 2 కొరింథీ. 12:12; హెబ్రీ. 2:3, 4 చూడండి. [18]రోమా. 4:1-25; హెబ్రీ. 11:8-12, 17-19; యాకోబు 2:18-24 చూడండి. [19]F. F. Bruce, *The Epistle to the Galatians*, The New International Greek Testament Commentary (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 155. [20]అపొ. 11:18; రోమా. 3:24; 6:23 చూడండి.

[21]R. Alan Cole, *The Epistle of Paul to the Galatians*, The Tyndale New Testament Commentaries (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1965), 92. [22]రోమా. 2:28, 29; ఫిలిప్పీ. 3:2, 3; కొలస్సీ. 2:11-13చూడండి. [23]Boles, 76. [24]Johnson, 83. [25]2 కొరింథీ. 5:21; హెబ్రీ. 4:15; 5:8, 9; 1 పేతురు 2:22; 1 యోహాను 3:5 చూడండి. [26]1 కొరింథీ. 6:20; 7:23; 2 పేతురు 2:1; ప్రకటన 5:9; 14:3, 4 చూడండి. [27]Leon Morris, *Galatians: Paul's Charter of Christian Freedom* (Downers Grove, Ill.: InterVarsity Press, 1996), 106. [28]Bauer, 685. [29]Ludwig Koehler and Walter Baumgartner, *The Hebrew and Aramaic Lexicon of the Old Testament*, study ed., trans. and ed. M. E. J. Richardson (Boston: Brill, 2001), 1:863. [30]సిలువను గూర్చిన ఎక్కువ వివరణ కొరకు David Stewart, *A Commentary on Philippians* (Searcy, Ark.: Stewart Publications, 2006), 279–83లో ఇవ్వబడింది.

[31]Longenecker, 128. [32]Morris, 109. [33]Boles, 82. [34]William M. Ramsay, *A Historical Commentary on St. Paul's Epistle to the Galatians*, Limited Classical Reprint Library (N.p.: G. P. Putnams Sons, 1900; reprint, Minneapolis: Klock & Klock Christian Publishers, 1978), 354–55. [35]ఆది. 12:7; 13:15, 16; 15:5, 18; 16:10; 17:7-10; 22:17, 18 (KJV) చూడండి. [36]3:29లో అబ్రాహాము యొక్క ఆత్మీయ "వారసులను" గూర్చి సూచించుటకు పౌలు గ్రీకు పదమైన *sperma*, అను నామవాచకము ఉపయోగించెను. యూదా మతములో, ఇష్మాయేలు మరియు ఏశావు సంతానమును మినహాయించుకొని, ఇస్సాకు ద్వారా అబ్రాహాము యొక్క భావితరములకు ఒక సమిష్టి సూచనగా *zera'* అను పదము ఉపయోగించబడింది. [37]నోవాహు (ఆది. 9:8-17), అబ్రాహాము మరియు అతని కుటుంబము (ఆది. 15:18-21; 17:1-14), మోషే ద్వారా ఇశ్రాయేలీయులకు (నిర్గ. 19:5, 6; 24:3-8; 34:10), మరియు దావీదు మరియు అతని కుటుంబము (2 సమూ. 7:12-16; 23:5) వీరితో సహా పాత నిబంధనలో దేవుడు అనేక ప్రాముఖ్యమైన నిబంధనలను చేసెను. ఒక నూతన నిబంధనను వారితో నిర్మించుకుంటానని తాను ఏర్పరచుకొనిన ప్రజలతో వాగ్దానము చేసెను (యిర్మీ. 31:31-34; హెబ్రీ. 8:6-13 చూడండి). [38]Morris, 111. [39]Ibid. [40]ఈ గ్రీకు క్రియాపదాలు నామవాచకమైన κύριος (*kurios*)తో సంబంధం కలిగి ఉంది, ఈ పదము κύριος (*kurios*) అధికారమును సూచిస్తుంది. దీని అర్థము "ప్రభువు", "యజమానుడు", లేదా "శక్తివంతుడు."

[41]"వారసత్వము" అనుదానికి గ్రీకు పదము κληρονομία (*klēronomia*). (4:7పై వ్యాఖ్యానం చూడండి). [42]Johnson, 92. [43]ధర్మశాస్త్రము తాత్కాలికం అను ఆలోచన మొదటి శతాబ్దపు యూదులకు ఒక నవలగా ఉండేది. "ధర్మశాస్త్రము నిత్యమైనదియు, నిత్యమైన ఉద్దేశము కలిగియుండి మరియు దేవుని ప్రజల జీవితమునకు ప్రాముఖ్యమైనదిగా మొదటి యూదులు నమ్మేవారని" Ben Witherington III వాదించాడు. (Witherington, 254.) ఈ ఆలోచన *1 Enoch* 99.2; *Jubilees* 1.26–29; Josephus *Against Apion* 2.39లో ప్రతిబింబిస్తుంది. [44]David J. Lull, "'The Law Was Our Pedagogue': A Study in Galatians 3:19-25," *Journal of Biblical Literature* 105 (September 1986): 483. [45]*Jubilees* 1.26–29; Josephus *Antiquities* 15.5.3. [46]J. B. Lightfoot, *The Epistle of St. Paul to the*

*Galatians*, Classic Commentary Library (Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1957), 147. [47]Bauer, 1067. [48]ఆంగ్ల పదమైన “pedagogue” “శిక్షకుడను” లేదా “పాఠశాల ఉపాధ్యాయుడను” సూచించినను ఇది వాస్తవము. [49]అదనపు వివరణ కొరకు Longenecker, 146–48; Norman H. Young, “*Paidagōgos*: The Social Setting of a Pauline Metaphor,” *Novum Testamentum* 29, no. 2 (1987): 150–76; Norman H. Young, “The Figure of the *Paidagōgos* in Art and Literature,” *Biblical Archaeologist* 53, no. 2 (June 1990): 80–86చూడండ. [50]Herodotus *Histories* 8.75.

[51]Libanius *Orations* 58.8. [52]Aristides *In Defense of Oratory* 380. [53]Bruce, 182. [54]Xenophon *Lacedaemonians* 3.1. [55]Robert Guelich, “Custodian,” in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:840. [56] నిర్గ. 4:22, 23; ద్వితీయో. 14:1, 2; హోషే. 11:1చూడండి. [57]*Psalms of Solomon* 17.26, 27; *Jubilees* 1.22–25; *3 Maccabees* 6.28. [58]“ఆత్మ బాప్తిస్మముకు ప్రాధాన్యతనిస్తూ నీళ్ల బాప్తిస్మమును చిన్నచూపు చూచువారు, ఆత్మీయ బాప్తిస్మము మానవుల నుండి కోరబడలేదు, మరియు అది ఒకవేళ కోరబడితే దానికి విధేయత చూపుట కష్టం అన్న విషయమును గ్రహించాలి” అని Boles చెప్పాడు. నీటి బాప్తిస్మము విశ్వాసుల యొద్ద నుండి కోరదగినది మరియు అది క్రైస్తవుల యొక్క సహజ అనుభవముగా ఉంది” (Boles, 95). [59]Longenecker, 156. [60]1 కొరింథీ. 7:22; 12:13; ఎఫెసీ. 2:14, 15; కొలస్సీ. 3:11; ఫిలేమోను 16 చూడండి.

[61]1 కొరింథీ. 11:3-16; 14:34-36; ఎఫెసీ. 5:22-33; కొలస్సీ. 3:18, 19; 1 తిమోతి 2:8-15; 3:2, 8, 12; తీతు 2:3-5చూడండి. (Jack Cottrell, *Gender Roles and the Bible: Creation, the Fall, and Redemption* [Joplin, Mo.: College Press Publishing Co., 1994], 217–94 చూడండి.) [62]F. LaGard Smith, *Men of Strength for Women of God* (Eugene, Oreg.: Harvest House Publishers, 1989), 203. [63]A. M. Toplady, “Rock of Ages,” *Songs of Faith and Praise*, comp. and ed. Alton H. Howard (West Monroe, La.: Howard Publishing Co., 1994). [64]ఈ ప్రధాన మాటలు Warren W. Wiersbe, *The Bible Exposition Commentary: New Testament*, vol. 1 (Colorado Springs, Colo.: Victor, 2001), 701–4 నుండి తీసుకొనబడెను.